సాక్షి
జోగులాంబ గద్వాల

బుధవారం : 3 : మే : 2023



నిధులున్నా.. నిర్లక్ష్యం

తండాల అభివృద్ధికి ప్రభుత్వం నిధులు వెచ్చిస్తున్నా ఫలితం లేకుండా పోతుంది.

వివరాలు 8లో ▸



నేటినుంచి బ్రహ్మోత్సవాలు

బీచుపల్లి ఆంజనేయస్వామి బ్రహ్మోత్సవాలు బుధవారం ప్రారంభం కానున్నాయి.

వివరాలు 10లో ▸

గరిష్టం/కనిష్టం
33.0 /24.2

వాతావరణం

గాలిలో తేమ శాతం అధికంగా ఉండడంతో చల్లగా ఉంటుంది. రోజంతా ఆకాశం మేఘావృతమై వర్షం పడే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

'గురుకుల' టెండర్లకు ఆహ్వానం

గద్వాల అర్బన్: జిల్లాలోని మైనార్టీ గురుకుల విద్యాసంస్థల్లో పాలు, గుడ్లు, పండ్లు, కిరాణం, కూరగాయలు, చికెన్ సరాఫరా చేసేందుకు టెండర్లు ఆహ్వానిస్తున్నట్లు మైనార్టీ సంక్షేమ శాఖ అధికారి ప్రసాద్ రావు ఒక ప్రకటనలో తెలిపారు. గద్వాల పట్టణం, ఉండవెల్లిలోని బాలికల గురుకుల పాఠశాలలు, కళాశాలల్లో 2023–24కు టెండర్లను ఆహ్వానిస్తున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తి గల వారు కిరాణానికి రూ.80వేలు, చికెన్, గుడ్లకు రూ. 30వేలు, కూరగాయలకు రూ. 15వేలు, పండ్లకు రూ.15వేలను జిల్లా మైనార్టీ సంక్షేమ అధికారి పేరుతో ఈఎం డీడీ తీసి, టెండర్ ఫాంతో పాటు జతపర్చి ఈనెల 9వ తేదిలోగా జిల్లా కేంద్రంలోని మైనార్టీ సంక్షేమ శాఖ కార్యాలయంలో సమర్పించాలని తెలిపారు. మరిన్ని వివరాలకు సెల్ నం.7013032567, 8099059007లను సంప్రదించాలని తెలిపారు.

సరిహద్దులో పోలీస్ నిఘా



గట్టు: కర్ణాటక రాష్ట్రంలో ఎన్నికలు సందర్భంగా తెలంగాణ, కర్ణాటక సరిహద్దుల్లోని బల్గెర చెక్ పోస్టు దగ్గర పోలీస్ నిఘాను ఏర్పాటు చేశారు. మంగళవారం కర్నూలు రాయచూర్ అంతర్రాష్ట్ర రహదారి బల్గెర దగ్గర చెక్ పోస్టును ఎస్బీ సీఐ శివకుమార్, ఎక్సైజ్ సీఐ గోపాల్ తనిఖీ చేశారు. పక్క రాష్ట్రంలో అసెంబ్లీ ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని పటిష్ట నిఘాను ఏర్పాటు చేస్తున్నట్లు ఎస్బీ సీఐ తెలిపారు. ఎస్పీ ఆదేశాల మేరకు కర్ణాటక నుంచి తెలంగాణలోకి వచ్చే వాహనాలతో పాటుగా కర్ణాటక వైపు వెళ్లే ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేస్తామన్నారు. మద్యం, డబ్బు తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. చెక్ పోస్ట్ వద్ద ఇద్దరు సీఐలు, ఎస్ఐ, ఏఎస్ఐ, ఇద్దరు హెడ్‌కానిస్టేబుల్, ముగ్గురు పోలీస్ సిబ్బంది విధులు నిర్వర్తిస్తారని పేర్కొన్నారు. ప్రజలు సహకరించాలని కోరారు.

చెక్‌పోస్టుల నిర్వహణకు అదనపు సిబ్బంది

నారాయణపేట రూరల్: జిల్లా సరిహద్దు చెక్ పోస్టుల్లో విధులు నిర్వహించేందుకు ఇతర జిల్లాల నుంచి అదనంగా సిబ్బందిని తీసుకున్నట్లు ఎస్పీ ఎన్.వెంకటేశ్వర్లు ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాకు అనుకుని కర్నాటక సరిహద్దు కలిగిన రహదారుల వెంట మొత్తం 6 చెక్‌పోస్టులను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. దీనికిగాను మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్, వనపర్తి జిల్లాల నుంచి ఐదుగురు ఎస్ఐలు, 20మంది ఏఎస్ఐలు, మరి కొందరు హెడ్ కానిస్టేబుల్స్, కానిస్టేబుళ్లను తీసుకున్నామని చెప్పారు.

నేడు ఎంఎల్‌హెచ్‌పీ పోస్టులకు ఇంటర్వ్యూలు

నాగర్‌కర్నూల్: కలెక్టర్ ఆదేశానుసారం బుధవారం మిడ్‌లెవల్ హెల్త్ ప్రొవైడర్(ఎంఎల్‌హెచ్‌పీ) పోస్టులకు పాలెం డీఎంహెచ్‌ఓ కార్యాలయంలో ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు డీఎంఅండ్‌హెచ్‌ఓ సుధాకర్‌లాల్ ఓ ప్రకటనలో తెలిపారు. కాంట్రాక్ట్ పద్ధతిలో 14 పోస్టులను భర్తీ చేయనున్నామని, అర్హత గల అభ్యర్థులు ఉదయం 10:30గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు ఇంటర్వ్యూకు హాజర కావాలని పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు ww.nagarkurnool.telangana.gov.in వెబ్‌సైట్‌ను సందర్శించాలని తెలిపారు.

పోటీ పరీక్షలకు ఉచిత శిక్షణ

కందనూలు: టీఎస్ స్టడీ సర్కిల్ ఆధ్వర్యంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ డిగ్రీ ఉత్తీర్ణులైన విద్యార్థులకు స్టేట్ సర్వీసెస్, బ్యాంకింగ్, రైల్వే, స్టాఫ్ సెలక్షన్ కమిషన్ లాంటి పోటీ పరీక్షలకు ఉచితంగా రెసిడెన్షియల్ శిక్షణ ఇవ్వనున్నట్లు జిల్లా షెడ్యూల్డ్ కులాల అధికారి రామ్‌లాల్ ఒక ప్రకటనలో తెలిపారు. మహబూబ్‌నగర్‌లోని స్టడీ సర్కిల్ బ్రాంచిలో ఈ ఉచిత శిక్షణ తరగతులను నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. జిల్లాలో డిగ్రీ ఉత్తీర్ణత సాధించిన షెడ్యూల్డ్ కులాల అభ్యర్థులు www.studycirce.co.in వెబ్‌సైట్ ద్వారా ఈనెల 14వ తేదీలోపు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని, ఈనెల 21న ఉదయం 11 గంటలకు ప్రవేశ పరీక్ష పరీక్ష ఉంటుందని, మెరిట్ ఆధారంగా ఉచిత కోచింగ్ ఇస్తారని పేర్కొన్నారు. జూన్ నుంచి అక్టోబర్ వరక ఉచిత భోజనం, వసతితో అలాగే స్టడీ మెటీరియల్, పర్సనల్ అలవెన్స్ కింద రూ. 2500 ఇస్తారని తెలిపారు.

సైబర్ ముప్పు..!

'నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేట లోని మహేంద్రనగర్ కాలనీకి చెందిన శ్రీకాంత్ ఫోన్‌కు గతనెల 20న అపరిచిత వ్యక్తుల నుంచి మెసేజ్ వచ్చింది. ఇంట్లో నుంచే పార్ట్‌టైం జాబ్ చేస్తూ డబ్బులు సంపాదించొచ్చు అంటూ వచ్చిన లింక్‌పై నొక్కడంతో శ్రీకాంత్ అకౌంట్లో ఉన్న రూ.1.40 లక్షలు మాయమయ్యాయి. మోసపోయినట్టు గుర్తించిన బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు.'

'వనపర్తి జిల్లా కేంద్రానికి చెందిన శ్రీనివాసులు వాట్సప్‌కు గత నెల 22న వచ్చిన మెసేజ్‌కు స్పందించాడు. అపరిచితుల నుంచి వచ్చిన వాట్సప్ లింకుపై క్లిక్ చేయగానే, అకౌంట్లో ఉన్న రూ.94 వేలు డ్రా అయినట్టు వచ్చిన మెసేజ్ చూసి కంగుతిన్నాడు. జరిగిన మోసాన్ని గుర్తించి వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ఇలాంటి ఘటనలు పెరిగిపోతున్నాయి.'

- ఆన్‌లైన్ ద్వారా సైబర్ మోసాలు
- ఉమ్మడి జిల్లావ్యాప్తంగా పెరుగుతున్న బాధితులు
- క్షేత్రస్థాయిలో అవగాహన కరువు
- బాధితులు వెంటనే ఫిర్యాదు చేయాలంటున్న పోలీసులు



అవగాహన లేకపోవడం వల్లే..

సైబర్ నేరాల్లో అధికంగా అపరిచిత వ్యక్తుల నుంచి వస్తున్న మెసేజ్‌లే ఎక్కువగా ఉంటున్నాయి. మెసేజ్‌లో వచ్చిన లింకుపై క్లిక్ చేయగానే క్షణాల్లో అకౌంట్లో డబ్బులు మాయమవుతున్నాయి. తర్వాత ఆన్‌లైన్ యాప్‌ల్లో పెట్టుబడి పెట్టాలంటూ, ఉద్యోగాలు ఇస్తామంటూ అమాయకులకు ఎరవేస్తూ మోసాలకు పాల్పడుతున్నారు. దీనిపై సంబంధిత క్షేత్రస్థాయిలో అవగాహన కల్పించకపోవడంతోనే బాధితుల సంఖ్య పెరుగుతుందనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

ఉమ్మడి జిల్లావారీగా నమోదైన సైబర్ నేరాల వివరాలు

జిల్లా	కేసులు (2022)	కేసులు(2023)	రికవరీ/ఫ్రీజ్ చేసిన మొత్తం (రూ.లక్షల్లో)
మహబూబ్‌నగర్	42	4	9.21
నాగర్‌కర్నూల్	69	12	22
వనపర్తి	38	10	1.45
గద్వాల	52	5	4.48
నారాయణపేట	49	12	1.50

సాక్షి, నాగర్‌కర్నూల్: ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా వ్యాప్తంగా ఇటీవల సైబర్ నేరాల కేసులు క్రమంగా పెరుగుతున్నాయి. రెప్పపాటు కాలంలో మోసానికి గురిచేసే సైబర్ నేరాలపట్ల అవగాహన కొరవడటంతోనే బాధితులు ఎక్కువ సంఖ్యలో మోసపోతున్నారు. సైబర్ మోసానికి గురై రూ.లక్షల్లో డబ్బులు కోల్పోతున్న వారిలో ఉద్యోగులు, అక్షరాస్యులు సైతం ఉంటున్నారు. సైబర్ నేరాలకు గురైన వారిలో చాలామంది బాధితులు తమ పరువు పోతుందనే ఉద్దేశంతో పోలీసులకు ఫిర్యాదు చేసేందుకు సైతం ముందుకు రావడం లేదని తెలుస్తోంది. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా రెండేళ్లలో చోటుచేసుకున్న సైబర్ నేరాల్లో అధికంగా సెల్‌ఫోన్‌కు వచ్చిన మెసేజ్‌లకు స్పందించడం, ఆన్‌లైన్ యాప్‌లకు సంబంధించినవే అధికంగా ఉంటున్నాయి.

నాగర్‌కర్నూల్, గద్వాల జిల్లాల్లో అధికం..

సైబర్ నేరస్తుల బారిన పడి మోసపోతున్న బాధితుల సంఖ్య రోజురోజుకీ పెరుగుతోంది. 2022లో ఉమ్మడి జిల్లావ్యాప్తంగా సైబర్ నేరాలకు సంబంధించి మొత్తం 250 కేసులు నమోదు కాగా, ఈ ఏడాది గడిచిన నాలుగు నెలల్లోనే మొత్తం 43 కేసులు నమోదయ్యాయి. అలాగే పోలీస్‌స్టేషన్ల మెట్లు ఎక్కని బాధితుల సంఖ్య ఇంకా ఎక్కువే ఉంటుందని తెలుస్తోంది. నాగర్‌కర్నూల్ జిల్లాలోనే అత్యధిక సంఖ్యలో సైబర్ కేసులు నమోదవుతున్నాయి. ఈ జిల్లాలో 2022లో మొత్తం 69 కేసులు నమోదయ్యాయి. వీరిలో అధికంగా నాగర్‌కర్నూల్ మండలంలో 21 మంది, కల్వకుర్తిలో 11 మంది సైబర్ నేరగాళ్ల ఉచ్చులో పడి పెద్ద మొత్తంలో డబ్బులు కోల్పోయారు. ఈ ఏడాదిలో మొత్తం 12 మంది బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆ తర్వాత జోగుళాంబ గద్వాల జిల్లాలో అధికంగా 57 మంది సైబర్ నేరాలకు గురయ్యారు.

వెంటనే ఫిర్యాదు చేయాలి..



ఇటీవల కాలంలో సైబర్ నేరాలకు సంబంధించిన కేసులు పెరుగుతున్నా యి. అపరిచితుల నుంచి వచ్చే అనవసర మెసేజ్‌లకు స్పందించొద్దు. తక్కువ మొత్తాలకు ఎక్కువ వడ్డీ ఇస్తామని చెప్పే ఆన్‌లైన్ యాప్ జోలికి వెళ్లొద్దు. మోసపోయినట్టు గుర్తించినా వెంటనే బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేయాలి. వెంటనే ఫిర్యాదు చేస్తే సొమ్ము రికవరీ చేసే అవకాశం ఉంటుంది.

– రామేశ్వర్, ఏఎస్పీ, నాగర్‌కర్నూల్

'సోలో పవర్ వరల్డ్'తో టోకరా..

నారాయణపేట జిల్లా మాగనూర్‌లో ఇటీవల భారీ ఆన్‌లైన్ మోసం వెలుగుచూసింది. తక్కువ మొత్తంలో పెట్టుబడితోనే ఎక్కువ లాభం వస్తుందంటూ చెప్పిన కేటుగాళ్ల మాయాలోపడి సుమారు 40 మంది వరకు బాధితులు మోసపోయినట్టు తెలిసింది. 'సోలో పవర్ వరల్డ్' అనే ఆన్‌లైన్ యాప్‌లో ఒకసారి రూ.20 వేలు పెట్టుబడి పెడితే రోజుకు రూ.960 చొప్పున, మొత్తం 185 రోజుల వరకు రూ.1,78,800 వస్తాయంటూ యాప్ నిర్వాహకులు నమ్మబలికారు. కొన్నిరోజుల పాటు అకౌంట్లలో డబ్బులు పడ్డ తర్వాత గత వారం రోజులుగా యాప్ ఓపెన్ కావడం లేదు. ఒకరికి తెలిసిన వారు ఒకరు ఇలా ఒకే గ్రామానికి చెందిన బాధితులు మొత్తం సుమారు రూ.8లక్షల వరకు కోల్పోయినట్టు తెలిసింది. అయితే ఇంత జరిగినా దీనిపై ఫిర్యాదు చేసేందుకు బాధితులు ముందుకు రాకపోవడం గమనార్హం. ఇలాంటి సమయాల్లో బాధితులు వెంటనే స్పందించి ఫిర్యాదు చేస్తేనే ప్రయోజనం ఉంటుందని పోలీసులు చెబుతున్నారు.

సీపీఆర్‌తో ప్రాణాలు కాపాడొచ్చు



సీపీఆర్ శిక్షణను పరిశీలిస్తున్న ఎస్పీ సృజన

గద్వాల క్రైం: ఎక్కడైనా.. ఎవరైనా.. ప్రాణాపాయ పరిస్థితిలో ఉంటే తక్షణం స్పందించి వారికి సరైన పద్ధతిలో సీపీఆర్ చేసి ప్రాణాలు కాపాడాలని, ప్రతి పోలీస్ సిబ్బంది దీనిపై అవగాహన కలిగి ఉండాలని ఎస్పీ సృజన అన్నారు. మంగళవారం జిల్లా ఆరోగ్యశాఖ కార్యాలయంలో అత్యవసర పరిస్థితిలో తీసుకునే జాగ్రత్తలపై శిక్షణ కార్యక్రమాన్ని ఏర్పాటు చేయగా.. ఎస్పీ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఇటీవల చాలా మంది చాతినొప్పి, విద్యుదాఘాతం, రోడ్డు ప్రమాదాల కారణంగా క్షతగాత్రులవుతున్నారని, ఆపద సమయంలో వారికి చికిత్స అందక చాలామంది మృతిచెందడం బాధాకరమన్నారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా ఉండేందుకు రాష్ట్ర ప్రభుత్వం నిపుణుల సూచనలు ప్రతి ఒక్కరికి తెలిసేలా అత్యవసర పరిస్థితుల్లో ఉన్న వారికి సీపీఆర్ ఎలా చేయాలి అనే దానిపై శిక్షణ ఇస్తుందన్నారు. సిబ్బందికి వైద్యుల సమక్షంలో తీసుకోవాల్సిన అంశాలపై వివరించారు. కార్యక్రమంలో వైద్యులు రాజు, డీఎస్పీ ఇమ్మానేయేలు, ఆర్ఐలు నగేష్, పెద్దయ్య ఉన్నారు.

బాదేపల్లిలో వేరుశనగ రూ.6,690

జడ్చర్ల: బాదేపల్లిలోని వ్యవసాయ మార్కెట్‌లో మంగళవారం వేరుశనగ క్వింటాల్‌కు గరిష్ఠంగా రూ.6,690, కనిష్ఠంగా రూ.3,629 ధరలు లభించాయి. అలాగే మొక్కజొన్నకు గరిష్ఠంగా రూ.1,825, కనిష్ఠంగా రూ.1,421, ఆముదాలు గరిష్ఠంగా రూ.5,470, కనిష్ఠంగా రూ.4,849, జొన్నలు గరిష్ఠంగా రూ.4,851, కనిష్ఠంగా రూ.2,411, హంసకు గరిష్ఠంగా రూ.1,856, కనిష్ఠంగా రూ.1,625, ఆర్ఎన్ఆర్‌కు గరిష్ఠంగా రూ.2,339, కనిష్ఠంగా రూ.1,625 చొప్పున వచ్చాయి.

అకాల వర్షాలతో రైతు కుదేలు..



మానవపాడులో వర్షానికి తడిసిన మిర్చిపై కవర్లు కప్పుతున్న రైతు

- నేలకొరిగిన వరి పంట
- మిరప, మొక్కజొన్నకు వీడని వాన బెడద
- మార్కెట్ లేక, నిల్వ ఉంచలేక దిగాలు

కేటీదొడ్డి/రాజోళి/మానవపాడు/మల్దకల్: అకాల వర్షాలతో రైతు కుదేలవుతున్నాడు. ఆరుగాలం కష్టపడి పండించిన పంటలను కాపాడులేక దిగాలు చెందుతున్నారు. రాజోళి, కేటీదొడ్డి, మల్దకల్, మానవపాడు తదితర ప్రాంతాల్లో సోమవారం నుంచి మంగళవారం వరకు కురిసిన వర్షానికి వందల ఎకరాల్లో వరి పంట నేలకొరిగింది. అలాగే, మిరప, మొక్కజొన్న, మామిడి రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మార్కెట్ లేకపోవడంతో గిట్టుబాటు ధర వచ్చాక అమ్ముకుందామని మొక్కజొన్న, మిరప పంటలను నిల్వ ఉంచుకున్న రైతులకు వరుణుడి రూపంలో నష్టం వెంటాడుతుంది. వేసవి కాలం ధాన్యాన్ని ఆరబెట్టుకుంటే మరింత ధర వస్తుందనుకొని, పొలాలు, కల్లాల వద్ద కుప్పలు పోసుకుంటే, రాత్రికి రాత్రే కురుస్తున్న వర్షాల కారణంగా పూర్తిగా తడిసిపోతున్నాయి. చివరకు విక్రయించేందుకు వీలు లేకుండా ఉందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

■ మల్దకల్‌లో మంగళవారం ఉదయం కురిసిన వర్షానికి 80 ఎకరాలకు పైగానే వరి పంట నేలమట్టమైంది. దాసరిపల్లికి చెందిన రైతులు గోవిందు, సమరసింహారెడ్డి, కొండారెడ్డి, రఘుపతిరెడ్డి, బత్తలయ్య వారి వ్యవసాయ పొలాల్లో నీటి వసతి ఆధారంగా వరి పంటను సాగు చేశారు. మరో 15 రోజుల్లో వరి పంట చేతికందుతున్న తరుణంలో అకాల వర్షాల కారణంగా వరి పంట పూర్తిగా నేలమట్టమైనట్లు రైతులు వాపోయారు. రూ.లక్షల్లో పెట్టుబడులు పెట్టామని, పంట చేతికందుతున్న తరుణంలో ఇలా నేలపాలు కావడంతో రైతులు లబోదిబోమంటున్నారు. రైతు గోవిందు 8 ఎకరాలకు పైగా వరి సాగు చేశాడు. పెట్టుబడి కోసం రూ.2లక్షలకు పైగా పెట్టగా.. తీవ్ర నష్టం వాటిల్లింది.



మల్దకల్ మండలం దాసరిపల్లెలో అకాల వర్షానికి నేలకొరిగిన వరి పంట



కేటీదొడ్డిలో వర్షానికి మొలకెత్తిన వడ్లను చూపుతున్న మహిళా రైతు



కేటీదొడ్డి మండలంలోని వెంకటాపురంలో నీట మునిగిన వరి పంట

■ కేటీదొడ్డిలో అకాల వర్షం రైతును ఆగం చేస్తుంది. తీవ్రమైన గాలులతో కూడిన వర్షానికి వరిపంట దెబ్బతింది. మండలంలోని వెంకటాపురంలోని చెరువు నిండి చేతికొచ్చిన పంట మొత్తం మునిగిపోయింది. కేటీదొడ్డిలో వరిధాన్యం తడిసి మెలకెత్తింది. దెబ్బతిన్న పంటలను పరిశీలించి ప్రభుత్వానికి నివేదిస్తామని వ్యవసాయ అధికారులు తెలిపారు. ఇదిలాఉండగా, దెబ్బతిన్న వరి, మామిడి పంటలను మంగళవారం ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి పరిశీలించి రైతులతో మాట్లాడారు. నష్టపోయిన రైతులు ఎవరూ కూడా అధైర్యపడద్దని, నష్టపరిహారం అందిస్తామని హామీ ఇచ్చారు. గతంలో ఎప్పుడు లేని విధంగా ఈ వేసవికాలంలో వర్షాలు రావడం రాష్ట్ర వ్యాప్తంగా రెండు మూడు రోజుల నుంచి అకాల వర్షాలు రావడం వల్ల రైతులకు చేతికోచ్చిన పంటనాశనం అయ్యాయని పేర్కొన్నారు. వెంటనే వ్యవసాయ శాఖ మంత్రికి ఫోన్ చేసి విషయాన్ని తెలపగా.. మంత్రి సైతం విషయాన్ని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి రైతులను ప్రభుత్వం తరపున ఆదుకుంటామని తెలిపారు.

■ రాజోళి, తుమ్మలపల్లె, తూర్పుగార్లపాడు, పచ్చర్ల, మాన్‌దొడ్డి పెద్ద దన్వాడ తదితర గ్రామాల్లో రైతులు మిరప, మొక్కజొన్నను కాపాడుకునేందుకు ఉదయం, సాయంత్రం ప్రత్యేకంగా కాపాలా ఉండాల్సి వస్తుందని రైతులు వాపోతున్నారు. మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలు లేకపోవడంతో ధాన్యం విక్రయానికి ఇక్కట్లు ఎదుర్కొంటున్నారు. గత వారం రోజుల నుంచి వర్షం ఎప్పుడు వస్తుందో తెలియక రైతులు ఆందోళన చెందుతూ, ఇటు తక్కువ ధరకు ప్రైవేట్ వ్యాపారులకు విక్రయించలేక, ప్రభుత్వ కొనుగోలు కేంద్రం కోసం ఎదురు చూడలేక ధాన్యాన్ని వర్షార్పణం చేసుకున్నారు. ఉన్న కొంత పంటను



రాజోళిలో తడిసిన మిరపను ఏరివేస్తున్న రైతులు

ఎక్కువ సేపు మూసి ఉంచడం వల్ల మిరప తెల్ల రంగులోకి మారి, బూజు వస్తుందని ఆందోళన చెందుతన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి కొనుగోలు కేంద్రాలు ఏర్పాటుచేయాలని, నష్టపోయిన వారికి పరిహారం అందించాలని రైతులు కోరుతున్నారు.

అభివృద్ధి పనులు త్వరగా పూర్తి చేయాలి



మాట్లాడుతున్న కలెక్టర్ వల్లూరు క్రాంతి

గద్వాల రూరల్: జిల్లాలోని మున్సిపాలిటీల్లో అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేయాలని కలెక్టర్ వల్లూరు క్రాంతి అన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో ఆర్అండ్‌బీ, పంచాయతీ రాజ్, ఇరిగేషన్, టీఎస్ఎంఐ, ఇడబ్ల్యూఎస్ ఇంజినీర్లతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. జిల్లాలోని వడ్డేపల్లి, అయిజ అలంపూర్ మున్సిపాలిటీ పరిధిలో చేపడుతున్న డ్రెయినేజీలు, రోడ్లు, వైకుంఠధామాలు, సబ్ సెంటర్ల నిర్మాణ పనులను అడిగి తెలుసుకున్నారు. అయిజ 30 పడకల, అలంపూర్ 100 పడకల ఆస్పత్రి పనులను త్వరగా పూర్తి చేయాలన్నారు. అలంపూర్ మున్సిపాలిటీ పరిధిలో సెంట్రల్ లైటింగ్, డ్రెయినేజీ, ప్లాంటేషన్, మీడియన్ పనులను పూర్తి చేయాలన్నారు. అనంతరం ఎమ్మెల్యే అబ్రహం మాట్లాడుతూ నియోజకవర్గంలో చేపట్టిన అభివృద్ధి పనులు, టెండర్ పూర్తయి ఇంకా మొదలు కానీ పనులు చాలా ఉన్నాయని, వాటన్నింటిని సకాలంలో పూర్తి చేయాలన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ అపూర్వ్ చౌహాన్, పంచాయతీ రాజ్ ఈఈ ఆంజనేయులు, మున్సిపల్ చైర్మన్లు కరుణ, మనోరమ్మ, చిన్న దేవన్న, మున్సిపల్ కమిషనర్లు దయానంద్, గోపాల్, కాంట్రాక్టర్లు పాల్గొన్నారు.

మహిళల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ

మహిళల ఆరోగ్యంపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని కలెక్టర్ వల్లూరు క్రాంతి అన్నారు. మంగళవారం పాత ఎంపీడీఓ కార్యాలయంలో వైద్యారోగ్య శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఆరోగ్య మహిళ కార్యక్రమంపై అవగాహన సదస్సులో ఆమె పాల్గొని మాట్లాడారు. ప్రతి మంగళవారం మహిళ అధికారులు ఉన్న ప్రాంతాల్లో ఆరోగ్య మహిళ కార్యక్రమం ఏర్పాటు చేస్తున్నట్లు జిల్లాలో క్యాతూరు, మల్దకల్, మానవపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలోని మహిళా వైద్య అధికారులతో ఆరోగ్యం పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పిస్తామన్నారు. ప్రధానంగా క్యాన్సర్ స్క్రీనింగ్, ఓరల్ క్యాన్సర్, బ్రెస్ట్ క్యాన్సర్, మూత్రనాళిక ఇన్‌ఫెక్షన్స్, పీసీవోడీ, ఎస్‌టీఐ, శరీర బరువు నిర్వహణ తదితర అంశాలపై అవగాహన, నివారణ చర్యలపై మహిళలకు తెలియజేయాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ సిద్ధప్ప, మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారి ముషాయిదాబేగం, డాక్టర్ స్రవంతి, ఆశాలు, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

క్రీడలతోనే ఆరోగ్యం పదిలం

గద్వాల: ఆటలు ఆడటం ద్వారానే ఆరోగ్యం పదిలంగా ఉంటుందని ఎమ్మెల్యే కృష్ణమోహన్‌రెడ్డి అన్నారు. మంగళవారం స్థానిక మల్టీపర్పస్ ఇండోర్ స్టేడియంలో జిల్లా యువజన క్రీడల అభివృద్ధిశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వేసవి అథ్లెటిక్స్, వాలీబాల్, కబడ్డీ, తైక్వాండో, కరాటే క్రీడా శిక్షణా శిబిరాల ప్రారంభోత్సవానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరయ్యారు. శిబిరాన్ని లాంచనంగా ప్రారంభించిన అనంతరం ఎమ్మెల్యే మాట్లాడారు. చిన్నప్పటి నుంచి ఆటల్లో ముందుండాలని పిలుపునిచ్చారు. క్రీడలతో దేహ దారుఢ్యంతో పాటు క్రమశిక్షణ అలవడుతుందన్నారు. ఆరోగ్యకరమైన జిల్లాగా తీర్చిదిద్దాలని పిలుపునిచ్చారు. నైపుణ్యం గల క్రీడాకారులకు ప్రోత్సాహం అందిస్తామని భరోసా ఇచ్చారు. మీతోపాటు మీ ఇంటి దగ్గర ఉండే మీ స్నేహితులను వేసవి శిక్షణ శిబిరాన్నికి తీసుకొనిరావాలని సూచించారు. ఈ శిబిరం వేసవికే పరిమితం కాకుండా ఏడాది పొడువున నిరంతరం క్రీడలు ఆడేవిధంగా కొనసాగాలని కోరారు. మున్సిపల్ చైర్మన్ బీఎస్ కేశవ్ మాట్లాడుతూ గద్వాలలో ప్రతిభ గల క్రీడాకారులకు కొదవ లేదని, వారిని ప్రోత్సహిస్తే జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించే అవకాశం ఉందన్నారు. విద్యార్థులు చదువుతో పాటు సెలవుల్లో క్రీడలు ఆడుతూ ఆనందంగా గడపాలని సూచించారు. డీవైఎస్ఓ రమేష్‌బాబు మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా అవసరమైన దగ్గర శిక్షణ శిబిరాలను ఏర్పాటు చేశామన్నారు. వీటిలో కబడ్డీ, ఫుట్‌బాల్, క్రికెట్, వాలీబాల్, కరాటే, అథ్లెటిక్స్ విభాగాలలో శిక్షణ అందజేస్తున్నామన్నారు. చిన్నారుల్లో క్రీడా స్ఫూర్తిని పెంపొందించాలన్న ప్రధాన ఉద్దేశ్యంతో వేసవిలో ప్రత్యేక శిక్షణ ఇస్తున్నామన్నారు. విద్యార్థులు వినియోగించుకొని భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలని సూచించారు. అనంతరం ఆయా విభాగాల క్రీడా సామగ్రిని పంపిణీ చేశారు. ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి బీఎస్ ఆనంద్, స్టేడియం ఇన్‌చార్జి జితేందర్, కరాటే మాస్టర్ శ్రీహరిలతో కృష్ణయ్య, సతీష్, భరత్‌కుమార్, నగేష్, రజనికాంత్, నర్సింహారాజు, నర్సింహ పాల్గొన్నారు.



క్రీడాకారులతో ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి, అధికారులు

క్లుప్తంగా

ట్రాక్టర్ కిందపడి వ్యక్తి దుర్మరణం

మక్తల్: బతుకుదెరువు కోసం కూలి పనికి వెళ్లిన ఓ వ్యక్తి ట్రాక్టర్ కింద పడి దుర్మరణం పాలయ్యాడు. ఈ ఘటనకు సంబంధించి ఎస్ఐ పర్వతాలు కథనం ప్రకారం.. మక్తల్‌కు చెందిన కర్రెం అంజప్ప(40) హమాలీ పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో మంగళవారం మండలంలోని మాద్వార్ గ్రామం నుంచి ఓ రైతు వరిధాన్యం చందాపూర్‌కు చెందిన గుమాస్తా కొండయ్యకు చెందిన ట్రాక్టర్‌లో వరి ధాన్యం లోడ్‌తో వస్తున్నారు. అయితే పట్టణంలోని బస్టాండ్ మలుపు దగ్గర అంజప్ప ప్రమాదవశాత్తు ట్రాక్టర్‌పై నుంచి కాలు జారి కింద పడి అక్కడికక్కడే మృతిచెందాడు. ఈ ఘటనపై అంజయ్య భార్య పద్మమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

యువకుడి ఆత్మహత్య

ఖిల్లాఘనపురం: చెట్టుకు ఉరేసుకుని ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన మంగళవారం తెల్లవారుజామున మండలంలోని మల్కాపురంలో చోటుచేసుకుంది. గ్రామస్తుల వివరాల ప్రకారం.. మల్కాపురానికి చెందిన పానుగంటి శేఖర్(25) మంగళవారం ఉదయం గ్రామ శివారులోని కర్వెన రాంరెడ్డి వ్యవసాయ పొలంలో వేప చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నారు. అటుగా వెళ్తున్న గ్రామస్తులు గమనించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. వారు వచ్చి చూడగా అప్పటికే మృతిచెందాడు. మృతుడి అన్న పెద్ద శేషయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ శ్రీహరి తెలిపారు.

కడుపునొప్పి భరించలేక..

నవాబుపేట: మండలంలోని కూచూర్‌కు చెందిన ఓ వ్యక్తి కడుపునొప్పి భరించలేక ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్న సంఘటన చోటుచేసుకుంది. కూచూర్‌కు చెందిన జోగు రమేష్(45) కొంత కాలంగా కడుపునొప్పితో బాధపడుతున్నాడు. నొప్పి అధికం కావటంతో మంగళవారం గ్రామ సమీపంలోని చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడికి భార్య కలమ్మ, కూతురు, కుమారుడు ఉన్నారు. ఈ విషయమై ఎలాంటి ఫిర్యాదు అందలేదని ఎస్ఐ పురుషోత్తం తెలిపారు.

ఉద్యోగం రావడం లేదని యువకుడు..


అనిల్ (ఫైల్)

మహబూబ్‌నగర్ క్రైం: ఆర్మీ, కానిస్టేబుల్ ఉద్యోగం రాలేదని మనస్తాపంతో ఓ యువకుడు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. రూరల్ ఎస్ఐ వెంకటేశ్వర్లు కథనం ప్రకారం..హన్వాడ మండలం అత్యకుంటతండాకు చెందిన అనిల్(20) నాలుగు ఏళ్లుగా మర్లులో అద్దెకు ఉంటూ.. ప్రస్తుతం డిగ్రీ ఫైనలియర్ చదువుతున్నాడు. చదువుతోపాటు ఆర్మీ, కానిస్టేబుల్ ఉద్యోగాల కోసం ప్రయత్నాలు సాగించాడు. ఉద్యోగం రాకపోయే సరికి క్షణికావేశంలో మంగళవారం ఉదయం అద్దెకు ఉంటున్న గదిలో ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి తండ్రి సబావత్ కిషన్ నాయక్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి


రాములు (ఫైల్)

మిడ్జిల్: రోడ్డు ప్రమాదంలో గాయపడిన ఓ వ్యక్తి చికిత్స పొందుతూ మృతిచెందాడు. ఈ ఘటనకు సంబంధించి ఏఎస్ఐ భాద్రి కథనం ప్రకారం.. జడ్చర్ల మండలంలోని శంకరాయిపల్లితండాకు చెందిన రాములు(33) కల్వకుర్తిలోని ఆంధ్రాబ్యాంకులో ఉద్యోగం చేస్తున్నాడు. ఈ క్రమంలో మిడ్జిల్ మండలంలోని వస్పులకు చెందిన బాలయ్యతో కలిసి ఇద్దరూ సోమవారం సాయంత్రం పని ముగించుకొని ద్విచక్రవాహనంపై ఇంటికి వస్తుండగా మున్ననూర్ గ్రామ సమీపంలో మోటార్ సైకిల్ అదుపు తప్పి రోడ్డు పక్కన ఉన్న డివైడర్‌ను ఢీకొట్టారు. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన ఇద్దరిని టోల్‌గేట్‌కు చెందిన అంబులెన్స్‌లో జడ్చర్ల ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో హైదరాబాద్‌లోని నిమ్స్‌కు తీసుకెళ్లగా అక్కడే చికిత్స పొందుతూ రాములు మంగళవారం మధ్యాహ్నం మృతిచెందాడు. ఈ ఘటనపై రాములు భార్య లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ తెలిపారు. రాములుకు భార్యతోపాటు కుమారుడు, కూతురు ఉన్నారు.

పెబ్బేరులో మరొకరు..

పెబ్బేరు: ప్రమాదవశాత్తు హీటర్ పేలడంతో తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతున్న ఓ వ్యక్తి మృతిచెందాడు. ఈ ఘటనకు సంబంధించి వివరాలిలా.. పట్టణంలోని టైర్ల రీబట్టన్ షాపు యజమాని ఇషాక్ సహాబ్(60) గత నెల 29న షాపులో హీటర్ పంపు పేలడంతో తీవ్రగాయాలయ్యాయి. వెంటనే స్థానికులు చికిత్స కోసం కర్నూలు ఆస్పత్రికి తరలించగా అక్కడే చికిత్స పొందుతూ మంగళవారం మృతిచెందాడు. ఈ ఘటనపై ఎలాంటి ఫిర్యాదు అందలేదని ఎస్ఐ జగదీశ్వర్ తెలిపారు. ఇషాక్‌కు భార్య నషీబ్‌బేగంతోపాటు నలుగురు కుమారులు, ముగ్గురు కూతుళ్లు ఉన్నారు.

దరఖాస్తుల వెల్లువ

ప్లాట్ల క్రమబద్ధీకరణకు కలగనున్న మోక్షం

- జిల్లావ్యాప్తంగా జీఓ 59, 58లకు 2,823 అర్జీలు
- ఈ నెలాఖరు వరకు మరోసారి గడువు పెంచిన ప్రభుత్వం
- క్షేత్రస్థాయిలో పరిశీలనకు సిద్ధమవుతున్న అధికారులు
- ప్రభుత్వానికి భారీగా సమకూరనున్న ఆదాయం


జడ్చర్లలోని ఓ మీసేవలో దరఖాస్తు చేసుకుంటున్న లబ్ధిదారులు

మహబూబ్‌నగర్ న్యూటౌన్/ జడ్చర్ల టౌన్: మాకెలాంటి ఆధారం లేదు.. ఇంకెంత కాలం బిక్కుబిక్కుమంటూ గడపాలి.. ఎవరైనా అధికారులు వస్తే కూల్చేస్తారేమోనని కొందరు.. ప్రభుత్వ స్థలానికి బ్యాంకుల అప్పు పుట్టక బయట తెచ్చిన అప్పులతో భారంగా బతుకుతున్న పేదలకు భరోసా కల్పించేందుకు ప్రభుత్వం సంకల్పించింది. ప్రభుత్వ స్థలాల్లో ఇళ్లు నిర్మించుకొని ఆందోళన చెందే వారిని దృష్టిలో ఉంచుకొని రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న క్రమబద్ధీకరణ నిర్ణయం త్వరలో సఫలీకృతం కానుంది. ఈ మేరకు ప్రభుత్వం జీఓ 59, 58 ద్వారా మరోసారి అవకాశం కల్పించింది. ప్రభుత్వ స్థలాలను ఆక్రమించుకొని హక్కు కోసం ఎదురుచూస్తున్న వారికి త్వరలో ఆ పత్రాలు అందజేయాలని చర్యలు ముమ్మరం చేసింది. గత ఏప్రిల్ వరకు ఉన్న దరఖాస్తుల గడువును మరోసారి ఈ నెలాఖరు వరకు పెంచుతూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఇప్పటికే పెద్దఎత్తున దరఖాస్తులు రాగా వాటిని అధికారులు పరిశీలిస్తున్నారు. పేదల ఇంటికి వారే యజమానులుగా పూర్తిస్థాయి హక్కులు కల్పించేందుకు ప్రభుత్వం క్రమబద్ధీకరణతో పరిష్కారం చూపేందుకు కసరత్తు ప్రారంభించింది. వచ్చిన దరఖాస్తులను క్రోడీకరించుకొని క్షేత్రస్థాయి పరిశీలనకు వెళ్లేలా రెవెన్యూ శాఖ చర్యలు చేపడుతోంది. ప్రభుత్వ స్థలాల క్రమబద్ధీకరణతో ప్రభుత్వానికి ఆదాయంతోపాటు పేదలకు ఎంతో మేలు జరగనుంది.

వచ్చిన దరఖాస్తులిలా..

స్థలాల క్రమబద్ధీకరణలో ఎవరూ మిగిలిపోకుండా జీఓ 58, 59లకు ఇప్పటికే ప్రభుత్వం రెండు పర్యాయాలు గడువులు పెంచుతూ వచ్చింది. ఏప్రిల్ 30 వరకు దరఖాస్తులకు గడువు ఉండగా చివర్లో ఆన్‌లైన్ సర్వర్ బిజీ కారణంగా పూర్తిస్థాయిలో దరఖాస్తులు సమర్పించలేకపోవడం, పలు జిల్లాల నుంచి వచ్చిన విజ్ఞప్తులను పరిగణలోకి తీసుకున్న ప్రభుత్వం మరోసారి ఈ నెలాఖరు వరకు దరఖాస్తులకు గడువును పొడిగిస్తూ నిర్ణయం తీసుకుంది. కాగా జిల్లాలోని 17 మండలాల నుంచి జీఓ 58కు 2,322, జీఓ 59కు 501 దరఖాస్తులు వచ్చినట్లు సమాచారం. ఇందులో అత్యధికంగా జీఓ 58 ప్రకారం జడ్చర్ల మండలం నుంచి 1,699 దరఖాస్తులు, మహబూబ్‌నగర్ అర్బన్ నుంచి 535, హన్వాడ నుంచి 30 దరఖాస్తులు రాగా.. జీఓ 59 నుంచి జడ్చర్ల నుంచి 240, మహబూబ్‌నగర్ అర్బన్ నుంచి 133, అడ్డాకుల నుంచి 97 దరఖాస్తులు వచ్చాయి.

డివిజనల్ స్థాయిలో కమిటీ

పేదల ఇళ్ల స్థలాల క్రమబద్ధీకరణకు రెవెన్యూ డివిజనల్ స్థాయిలో కమిటీని ఏర్పాటు చేస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఆర్డీఓ చైర్మన్‌గా సంబంధిత తహసీల్దార్ మెంబర్ కన్వీనర్‌గా ఏర్పాటు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. 90రోజుల్లో క్రమబద్ధీకరణ ప్రక్రియను పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని ఉత్తర్వుల్లో పేర్కొంది.

జీఓలోని అంశాలివే..

- 125 చదరపు గజాల్లోపు ఆక్రమించుకొని నిర్మించుకున్న ఇళ్లను ఉచితంగా క్రమబద్ధీకరిస్తారు.
- 250 చదరపు గజాల్లోపు ఆక్రమణలకు ప్రభుత్వ కనీస ధరలో 50 శాతం ఫీజు చెల్లించాల్సి ఉంటుంది.
- 250 నుంచి 500 చ.గజాల్లోపు స్థలాలకు కనీస ధరలో 75 శాతం ఫీజు కట్టాలి.
- 500 నుంచి 1000 చ.గజాల్లో నిర్మాణాలు చేసుకున్న వారు ప్రభుత్వ కనీస ధర పూర్తిగా చెల్లించాలి.
- విస్తీర్ణంతో సంబంధం లేకుండా నివాసేతర వినియోగ భూములు ప్రభుత్వ కనీస ధర పూర్తిగా చెల్లించాల్సి ఉంటుంది.
- ఈ భూముల క్రమబద్ధీకరణ కోసం మీసేవా కేంద్రాల్లో దరఖాస్తు చేసుకోవాలి.

మరోసారి గడువు పెంపు..



ప్రభుత్వ స్థలాల్లో ఇల్లు నిర్మించుకొని ఎలాంటి ఆధారం లేకుండా ఎదురుచూస్తున్న పేదలకు పూర్తిస్థాయి హక్కులు కల్పించాలనే ఉద్దేశంతో జీఓ 58, 59 ద్వారా ప్రభుత్వం దరఖాస్తులు స్వీకరిస్తోంది. గత నెలాఖరు వరకు ఉన్న దరఖాస్తుల గడువును మరోసారి ఈ నెలాఖరు వరకు పొడిగించింది. – శ్రీనివాసులు, రెవెన్యూ అసోసియేషన్ రాష్ట్ర నాయకులు

దరఖాస్తు చేసుకున్నా



కావేరమ్మపేటలో 40 ఏళ్లకుపైగా నివాసం ఉంటున్నం. మా ఇంటికి ఎలాంటి ధ్రువపత్రాలు లేకపోయినా ప్రతి ఏటా ఇంటి పన్ను, నెలానెల కరెంట్ బిల్లు చెల్లిస్తున్నా. ప్రభుత్వం కల్పించిన అవకాశంతో జీఓ 58 ద్వారా ఇంటి స్థల క్రమబద్ధీకరణ కోసం మీసేవలో దరఖాస్తు చేసుకున్నా. – శివగౌడ్, కావేరమ్మపేట, జడ్చర్ల

అవకాశం ఉంది..



ప్రభుత్వ స్థలాల్లో ఇంటి నిర్మాణం చేసుకున్న వారి స్థలాలు క్రమబద్ధీకరించేందుకు చర్యలు తీసుకుంటాం. జీఓ 29 పోర్టల్ 58, 59 మీసేవలో ఈ నెలాఖరు వరకు దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం ఉంది. ప్రభుత్వ నిబంధనల ప్రకారం అర్హులైన వారందరి ఇంటి స్థలాలను క్రమబద్ధీకరిస్తాం. – మహమూద్ షేక్, మున్సిపల్ కమిషనర్, జడ్చర్ల

నిధులున్నా.. నిర్లక్ష్యం


బ్రిడ్జి నిర్మాణం చేపట్టనున్న అన్నారెడ్డిపల్లి వాగు

- ప్రారంభోత్సవాలకే పరిమితమైన అన్నారెడ్డిపల్లి రోడ్డు, బ్రిడ్జి పనులు
- రూ.2.70కోట్ల నిధులు మంజూరు
- అర్ధాంతరంగా నిలిపేసిన కాంట్రాక్టర్లు
- కంకరరోడ్డు, వాగుతో అవస్థలు పడుతున్న ప్రజలు


కంకరవేసి వదిలేసిన రోడ్డు

మహమ్మదాబాద్: తండాలను ప్రభుత్వం అభివృద్ధి పథంలోకి తీసుకొస్తున్నామని ఓ వైపు ప్రభుత్వం గొప్పలు చెప్పుకుంటుండగా.. ఆచరణలో మాత్రం అధికారుల నిర్లక్ష్యం కారణంగా గిరిజనులకు ఇబ్బందులు తప్పడం లేదు. ప్రతి గ్రామానికి బీటీ రోడ్డు ఏర్పాటు చేసి ప్రజలకు మెరుగైన ప్రయాణ సౌకర్యం కల్పించేందుకు నిధులు మంజూరు చేస్తున్నా అధికారులు, కాంట్రాక్టర్లు పనులు చేపట్టకపోవడంతో ప్రతినిత్యం కంకర రోడ్డుతో కష్టాలు పడుతున్నామని వాపోతున్నారు మహమ్మదాబాద్ మండలంలోని అన్నారెడ్డిపల్లి తండాకు చెందిన గిరిజనులు. మహబూబ్‌నగర్ చించోళి హైవే నుంచి అన్నారెడ్డిపల్లి తండా వరకు మూడు కిలోమీటర్ల మేర రోడ్డు నిర్మాణం చేపట్టేందుకు రెండేళ్ల కిందట రూ.కోటీ 23లక్షల నిధులు ట్రైబల్ వెల్ఫేర్ నుంచి మంజూరయ్యాయి. ఏడాదిన్నర కిందట రోడ్డు పనులు ప్రారంభించి సంబంధిత కాంట్రాక్టర్ కంకరవేసి వదిలేశారు. ఇప్పటికీ కంకరరోడ్డుపై వాహనాలు వెళుతూ దుమ్మూ, ధూళి, కంకరరాళ్లతో నిత్యం ప్రయాణికులు, ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.

శంకుస్థాపనకే పరిమితమైన బ్రిడ్జి..

అన్నారెడ్డిపల్లి వాగు నుంచి మహమ్మదాబాద్, మునిమోక్షం, వేపూర్, గౌండ్యాల్ ఇతర గ్రామాలకు ఎంతో మంది నిత్యం వందలాది వాహనాలు వెళ్తంటాయి. వర్షాకాలంలో వాగు వచ్చిందంటే తండావాసులు జల దిగ్బంధంలో చిక్కుకుంటారు. వంతెన ఏర్పాటు చేయాలని ఏళ్ల తరబడి అధికారులకు విజ్ఞప్తి చేస్తున్నారు. ఎట్టకేలకు వంతెన నిర్మాణం కోసం రెండు నెలల కిందట రూ.కోటీ 47లక్షల నిధులతో పరిగి ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి చేతులమీదుగా శంకుస్థాపన చేశారు. ఇప్పటి వరకు పనులు మొదలుకాకపోవడంతో ఈ వర్షాకాలం కూడా ఇబ్బందులు తప్పేలా లేవని గిరిజనులు అసహనం వ్యక్తం చేస్తున్నారు.

పట్టించుకోవడం లేదు..



మారుమూల ప్రాంతంలో ఉన్న గిరిజన తండాకు రోడ్డు, బ్రిడ్జి సమస్యలు ప్రధానంగా ఉన్నాయి. వర్షం వచ్చిందంటే వాగు పారుతుంటే గ్రామం నుంచి రాకపోకలు నిలిచిపోతాయి. యువకులు సాహసంతో వాగులో ప్రజలను దాటించే పరిస్థితి నెలకొంటుంది. రోడ్డు కోసం కంకరవేసి వదిలేయడంతో నిత్యం ఎప్పుడే ప్రమాదం జరుగుతుందోనని ఆందోళన చెందుతున్నాం. – ప్రతాప్, అన్నారెడ్డిపల్లి

వర్షాకాలంలో రాకపోకలు బంద్



నిత్యం కంకర రోడ్డుతో, దుమ్ము, ధూళితో గ్రామానికి వెళ్లాలంటే ఇబ్బందులు ఎదురవుతున్నాయి. దీనికి తోడు వర్షాకాలంలో వాగు దాటనివ్వక అవస్థలు పడుతున్నాం. ఈ విషయమై పలుమార్లు ఉన్నతాధికారులకు చెప్పినా పట్టించుకోవడం లేదు. కాంట్రాక్టర్లు పనిచేయడం లేదు. అధికారులు స్పందించి పనులు పూర్తి చేయాలి. – లక్ష్మి ఎంపీటీసీ, అన్నారెడ్డిపల్లితండా

త్వరలో పనులు ప్రారంభిస్తాం..

అన్నారెడ్డిపల్లి తండాకు వెళ్లే రోడ్డు, బ్రిడ్జి నిర్మాణ పనులు కాంట్రాక్టర్ల ఇబ్బందుల వల్ల నిలిచిపోయాయి. రోడ్డు బీటీ చేయాల్సి ఉంది. ఉన్నతాధికారులతో మాట్లాడి బ్రిడ్జి పనులు చేపట్టేలా చర్యలు తీసుకుంటాం. – మతీన్, పీఆర్ ఏఈ, మహమ్మదాబాద్

కర్ణాటక మద్యం పట్టివేత



కేటీదొడ్డి: కర్ణాటక మద్యాన్ని అక్రమంగా తరలిస్తున్న వారిని గుర్తించి పోలీసులు పట్టుకున్నారు. మండలంలోని నందిన్నె చెక్‌పోస్ట్ వద్ద వాహనాలు తనిఖీల్లో భాగంగా రాయిచూర్ నుంచి గద్వాల వైపు వస్తున్న ఆర్టీసీ బస్సులో విశ్వసనీయ సమాచారం అందడంతో డీఎస్పీ రంగస్వామి ఆధ్వర్యంలో ఎక్సైజ్ ఎస్ఐ ఖలీద్ తనిఖీ నిర్వహించగా 26 విస్కీ టెట్రా ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు అక్రమంగా మద్యం తరలిస్తున్న తాయప్పపై కేసు నమోదు చేసినట్లు వారు తెలిపారు. తనిఖీల్లో సీఐ చంద్రశేఖర్, ఎస్ఐలు వెంకటేష్, గోకారి, తదితరులు పాల్గొన్నారు.

సమస్తపూర్ చెక్‌పోస్టు వద్ద..

ఊట్కూర్: మండలంలోని సమస్తాపూర్ చెక్ పోస్టు దగ్గర మంగళవారం హైదరాబాద్‌కు చెందిన నర్సింహ మద్యంను కర్ణాటకకు తరలిస్తుండగా ఎక్సైజ్ ఎస్ఐ సునీత, ఎస్ఐ రమేశ్ పట్టుకొని కేసు నమోదు చేసినట్లు తెలిపారు. 24 బీర్లు, 3 ఫుల్ బాటిల్స్‌ను ద్విచక్రవాహనంపై తరలిస్తుండగా పట్టుకొని సీజ్ చేశామన్నారు.

బాలుడి మృతదేహం వెలికితీత

రాజాపూర్: ఈతకు వెళ్లి బావిలో మునిగిపోయిన బాలుడు దీక్షిత్ మృతదేహాన్ని మంగళవారం వెలికితీశారు. స్నేహితులతో కలిసి ఈతకు వెళ్లిన బాలుడు.. సోమవారం బావిగడ్డపై నుంచి నీటిలోకి దూకడంతో చెట్ల మధ్య ఇరుక్కుపోయి పైకి రాలేక అక్కడికక్కడే మృతిచెందాడు. సోమవారం నుంచి మంగళవారం మధ్యాహ్నం వరకు మోటార్లతో బావిలోని నీటిని పూర్తిగా తోడిపోయి చెట్ల మధ్య బురదలో ఇరుక్కున్న బాలుడి మృతదేహాన్ని గుర్తించి బయటకు తీశారు. దీంతో కుటుంబసభ్యుల రోదనలు మిన్నంటాయి. కేసు నమోదు చేసుకుని మృతదేహాన్ని జడ్చర్ల ప్రభుత్వ ఆస్పత్రిలో ఓస్టుమార్టం నిర్వహించి కుటుంబసభ్యులకు అప్పగించినట్లు ఎస్ఐ వెంకట్‌రెడ్డి పేర్కొన్నారు. బాధిత కుటుంబసభ్యులను టీపీసీసీ కార్యదర్శి అనిరుధ్‌రెడ్డి పరామర్శించారు.


దీక్షిత్ కుటుంబసభ్యులను పరామర్శిస్తున్న టీపీసీసీ కార్యదర్శి అనిరుధ్‌రెడ్డి

చనిపోతూ మరికొందరికి వెలుగునిస్తూ..

- యువకుడి బ్రెయిన్ డెడ్
- అవయవదానానికి ముందుకొచ్చిన తల్లిదండ్రులు


అఖిల్ (ఫైల్)

అమరచింత: అల్లారు ముద్దుగా పెంచుకొన్న కొడుకును.. కష్టపడి డాక్టర్ కోర్సు చదివించి.. ప్రజలకు వైద్య సేవలు అందించాలని కలలు గన్న ఆ తల్లిదండ్రుల ఆశలు ఆదిలోనే ఆవిరైపోయాయి. నిండు నూరేళ్లు జీవించాల్సిన తమ కుమారుడు 25 ఏళ్లకే తిరిగి రాని లోకాలకు వెళ్లిపోవడాన్ని జీర్ణించుకోలేని కన్న మనసులు తల్లడిల్లుతున్నాయి. ఇంతటి దుఃఖంలోనూ తమలోని మానవత్వాన్ని చాటి.. బ్రెయిన్ డెడ్ అయిన తమ కుమారుడి అవయవాలను దానం చేయడానికి ముందుకొచ్చారు. వివరాలిలా.. అమరచింతకు చెందిన చెందిన చిన్ని రమేష్, భారతి దంపతులకు ఒక కుమార్తె, ఇద్దరు కుమారులు ఉన్నారు. వీరిలో పెద్ద కుమారుడు అఖిల్(25) వైద్య కోర్సు పూర్తి చేసి బెంగుళూరులోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో వైద్యుడిగా పని చేస్తున్నాడు. ఈ క్రమంలో గత నెల 28న బెంగళూరు నుంచి కారులో నెల్లూరుకు వెళ్లారు. అక్కడ మరో కారులో స్నేహితుడితో కలిసి కావలి వైపు వెళ్తుండగా జరిగిన రోడ్డు ప్రమాదంలో అఖిల్‌కు తలకు బలమైన గాయమవగా.. మరో ఇద్దరు గాయపడగా.. మరొకరు అక్కడికక్కడే మృతిచెందాడు. వెంటనే క్షతగాత్రులను బెంగళూరులోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. సోమవారం ఉదయం అఖిల్ బ్రెయిన్ డెడ్ అయ్యాడని వైద్యులు తల్లిదండ్రులకు సమాచారం ఇచ్చారు.

తిరుపతిలో ఉండగానే..

నెల్లూరులోని కావలి సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో నిఖిల్ తీవ్రంగా గాయపడ్డాడనే విషయం తిరుపతి దర్శనానికి వెళ్లిన తల్లిదండ్రులకు తెలిసింది. దీంతో వెంటనే వారు తిరుపతి నుంచి బెంగుళూరుకు వెళ్లారు. ఈ క్రమంలో బ్రెయిన్ డెడ్‌కు గురైన తమ కుమారుడి అవయవాలను దానం చేయడానికి తల్లిదండ్రులు అంగీకరించారు. అఖిల్ ఎప్పుడూ తమతో అవయవదానం గురించి చెప్పేవాడని కన్నీటి పర్యంతమయ్యారు. దీంతో బెంగుళూరు నుంచి అఖిల్ మృతదేహాన్ని అంబులెన్స్‌లో హైదరాబాద్‌లోని కిమ్స్ ఆస్పత్రికి తరలించారు.



జేసీబీతో తూర్పు.. కష్టాలకు చెల్లు

అకాల వర్షాలకు ధాన్యం తడవడంతోపాటు కొనుగోళ్లలో ఇటీవల తరుగు కష్టాలు ఎక్కువయ్యాయి. ఈ క్రమంలో తాలు తొలగించడం రైతులను అష్టకష్టాలకు గురి చేస్తోంది. కూలీల కొరతను అధిగమించడంతోపాటు ఖర్చును తగ్గించుకునేందుకు మూసాపేట మండలం చక్రాపూర్‌కు చెందిన రైతు జగన్నాథ్‌రెడ్డి మంగళవారం జేసీబీని అద్దెకు తెచ్చి ఫ్యాన్ల సాయంతో తూర్పు పట్టారు. రైతు ఇలా వినూత్నంగా తూర్పు పట్టడాన్ని ఇతర రైతులు, కూలీలు ఆసక్తిగా తిలకించారు. – అడ్డాకుల

పీయూలో క్యాంపస్ ఎంపికలు

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: పాలమూరు యూనివర్సిటీలో మంగళవారం ఐసీఐసీఐ బ్యాంక్ ఆధ్వర్యంలో క్యాంపస్ సెలక్షన్స్ చేపట్టారు. ఈ మేరకు ఎంకాం 4వ సెమిస్టర్ విద్యార్థులు 54 మంది పాల్గొనగా.. 24 మంది ఎంపికయ్యారు. కార్యక్రమంలో వీసీ లక్ష్మీకాంత్ రాథోడ్, బ్యాంక్ ప్రతినిధులు హనుమాన్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

మిస్సింగ్ క్రెడిట్స్ సరిచేయాలి

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: జీఓ 317లో బదిలీ అయ్యి ఇతర జిల్లాలకు వెళ్లిన ఉపాధ్యాయులకు జెడ్పీ జీపీఎఫ్ కార్డ్స్ మిస్సింగ్ క్రెడిట్స్ పూర్తి చేశాక వారికి కేటాయించిన జిల్లాకు బదిలీ చేయాలని తపస్ సంఘం ఆధ్వర్యంలో అదనపు కలెక్టర్ సీతారామారావుకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు శ్రీనివాస్‌గౌడ్, సునీల్, గడ్డం బాబు తదితరులు పాల్గొన్నారు.



వేసవిలోనూ.. మత్తడి

మండు వేసవిలోనూ బండర్‌పల్లి చెక్‌డ్యాం జలకళ సంతరించుకుంది. మూడు రోజులుగా కురుస్తున్న అకాల వర్షాలతో చిన్నచింతకుంట మండలంలోని బండర్‌పల్లి చెక్‌డ్యాం మంగళవారం అలుగు పారింది. రాయిచూర్– హైదరాబాద్ అంతర్రాష్ట్ర రహదారి వెళ్లే మార్గంలో ఉన్న పురాతనమైన వంతెన స్థానంలో కోయిల్‌సాగర్ ప్రాజెక్ట్ నుంచి వచ్చే నీటి ప్రవాహాన్ని దృష్టిలో ఉంచుకొని ప్రజల రాకపోకలకు ఇబ్బందులు కలగకుండా ఎత్తును పెంచి కొత్తగా మరో వంతెన నిర్మించారు. వర్షాలు పడిన సమయంలో నీరు వృథాగా పోకుండా దాదాపు రెండు కి.మీ., మేర నీరు నిలిచి పరిసర ప్రాంతాల్లో భూగర్భ జలాలు పెరుగుతాయి. – దేవరకద్ర రూరల్

డ్రెయినేజీలో పసికందు మృతదేహం

జడ్చర్ల: ఎవరి పాపమో.. లేక మరేదైనా కారణమో.. కానీ, అప్పుడే పుట్టిన ఓ పసికందును రైలు పట్టాల పక్కన గల డ్రెయినేజీలో పడేసిన అమానవీయ ఘటన మంగళవారం జడ్చర్లలో వెలుగులోకి వచ్చింది. వివరాలిలా.. పట్టణంలోని సిగ్నల్‌గడ్డ ప్రాంతంలో రైల్వే పట్టాల పక్కన డ్రెయినేజీని రైల్వే కార్మికులు శుభ్రపరుస్తున్నారు. ఈ క్రమంలో ఓ ప్లాస్టిక్ సంచిని గుర్తించిన కార్మికులు అందులో నుంచి దుర్వాసన వస్తుండడంతో బయటకు తీసి చూశారు. అందులో కుళ్లిన దశలో పసికందు మృతదేహం ఉండటంతో వెంటనే రైల్వే అధికారులకు సమాచారం అందించారు. అయితే ఎవరైనా పెళ్లి కాకుండా శిశువును కన్నవారే ఈ దారుణానికి పాల్పడి ఉంటారని స్థానికులు అనుమానం వ్యక్తం చేశారు. ఒకవేళ పురిటిలోనే శిశువు మరణించి ఉంటే భూమిలో పూడ్చిపెట్టేవారని పేర్కొంటున్నారు. ఈ ఘటనకు సంబంధించి ఎలాంటి ఫిర్యాదు రాలేదని రైల్వే ఎస్ఐ సయ్యద్ అక్బర్ తెలిపారు. సంఘటనా స్థలం తమ పరిధిలోకి రాదని తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని సీఐ రమేశ్‌బాబు పేర్కొన్నారు.

వ్యక్తి అదృశ్యం


సుధాకర్ (ఫైల్)

బాలానగర్: కల్లుకు అలవాటు పడిన ఓ వ్యక్తి కల్లు లేకపోవడంతో కనిపించకుండాపోయిన ఘటన మండలంలోని బోడజానంపేట్‌లో గత నెల 29న చోటుచేసుకుంది. బోడజానంపేట్‌కు చెందిన సుధాకర్‌కు కల్లు తాగే అలవాటు ఉంది. 29న కల్లు తాగలేదు. ఆ రోజు నుంచి కనిపించడం లేదని సుధాకర్ తల్లి పద్మమ్మ పోలీస్‌స్టేషన్‌లో మంగళవారం ఫిర్యాదు చేసింది. సుధాకర్‌కు భార్య నందినితో పాటు మూడేళ్ల కూతురు ఉంది.

సాక్షి క్లాసిఫైడ్స్

EDUCATION
■ ఒకే సంలో 10th, Inter, NIOS, TOSS, B.A., B.Com., CS, B.Sc., MA, M.Com., M.Sc., Distance Education, Guidelines for B.Tech, Detained / fail Students NICC, KPHB. Hyd. Ph: 8179882462, 7993997624

SERVICES

BRICKS
■ Lease/Sale CRR లైయిట్ వెయిట్ బ్రిక్స్ తయారు చేసే కంపెనీ లీజుకు గాని, అమ్మకానికి కాని కలదు. Cell: 9885309804.

WANTED
■ హరేకృష్ణ హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్ / నర్సులు కావలెను. ఫ్రీ వసతి + భోజనం. జీ: 16K-18K ఏజెంట్ కమీషన్ 6K. ఫోన్: 9640258899

సాక్షి భవిత విద్యార్థుల కోసం

గమనిక

– సాక్షి మేనేజర్

విశ్వ నగరం వెలుగు రేఖలు

విశాఖలో అత్యాధునికంగా విద్యుత్ వ్యవస్థ
- ఆర్థిక నగరం భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా భూగర్భ కేబుళ్లు
- తుపాన్లు వచ్చినా సరఫరా నిలిచిపోకుండా రూ.925 కోట్లతో నిర్మాణం



విశాఖపట్నం నుంచి సాక్షి ప్రతినిధి: ఏదైనా ఒక రాష్ట్రం, ప్రాంతం ఆర్థిక స్థితిని అంచనా వేయడంలో విద్యుత్ వినియోగం కీలక పాత్ర పోషిస్తుంది. విశ్వ నగరంగా మారిన విశాఖ ఆర్థిక రాజధానిగా బలంగా ఎదిగేలా విద్యుత్ వ్యవస్థ రూపుదిద్దుకుంటోంది. భారీ పరిశ్రమలు, ఐటీ పార్కులు, డేటా సెంటర్లు, హోటళ్లు, ప్రభుత్వ, ప్రైవేట్ కార్యాలయాలు, మాల్స్, ఆస్పత్రులు, ఇతర వాణిజ్య కార్యకలాపాల కోసం నిరంతరం, నాణ్యమైన విద్యుత్‌ను అందించేలా విశాఖలో అత్యాధునిక సాంకేతికత అందుబాటులోకి వస్తోంది. ప్రకృతి వైపరీత్యాలు సంభవించినా సరఫరాకు ఎలాంటి ఆటంకం కలగని విధంగా భూగర్భం నుంచి కేబుళ్ల ద్వారా విద్యుత్ పంపిణీ కానుంది. పారిశ్రామికవేత్తలు, పర్యాటకులను ఆకర్షించడంతోపాటు భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా విశాఖలో సిద్ధమవుతున్న ఆధునిక విద్యుత్ వ్యవస్థపై 'సాక్షి' గ్రౌండ్ రిపోర్ట్ ఇదీ..

తుపాన్లకు తల వంచదు..

రాష్ట్రం నలుమూలల నుంచే కాకుండా ఇతర రాష్ట్రాలు, విదేశాల నుంచి సైతం ఎంతోమంది ఉద్యోగాలు, వ్యాపారాల కోసం వచ్చి విశాఖలో స్థిరపడుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం కల్పిస్తున్న ప్రోత్సాహాలను అందిపుచ్చుకుంటూ పలువురు పారిశ్రామికవేత్తలు సాగర నగరిలో పెట్టుబడులు పెట్టేందుకు ఆసక్తి కనబరుస్తున్నారు. ఈ నేపథ్యంలో విద్యుత్ వ్యవస్థను మరింత అభివృద్ధి చేసేందుకు డిస్కమ్‌లు సిద్ధమయ్యాయి. రాష్ట్ర ప్రభుత్వ ప్రోత్సాహంతో పనులు కూడా మొదలయ్యాయి. తుపాన్లు లాంటి విపత్తుల సమయంలోనూ విశాఖ నగరం అంతటా విద్యుత్ వెలుగులకు ఆటంకం కలుగకుండా రూ.925 కోట్లతో భూగర్భ విద్యుత్ కేబుల్ వ్యవస్థ పనులు జరుగుతున్నాయి. ఇప్పటికే రూ.481.49 కోట్ల ఖర్చుతో 80,529 విద్యుత్ కనెక్షన్లను భూగర్భ విద్యుత్ వ్యవస్థలోకి తెచ్చారు. నగరం మొత్తం 2,449 కి.మీ. పొడవున అండర్ గ్రౌండ్ కేబులింగ్ చేయనున్నారు. సముద్రాన్ని ఆనుకుని ఉన్న నగరం కావడంతో తుపాన్లు వచ్చినపుడు విద్యుత్ స్తంభాలు దెబ్బతింటున్నాయి. ఇకపై అలాంటి పరిస్థితి తలెత్తకుండా పాత స్తంభాల స్థానంలో సెంట్రిఫ్యూగల్లీ కాస్ట్ రీఇన్ఫోర్స్ కాంక్రీట్ స్తంభాలు (స్పన్‌పోల్స్) ఏర్పాటు చేస్తున్నారు. ఇప్పటికే 3,266 స్పన్‌పోల్స్ ఏర్పాటు కాగా అందుకోసం రూ.15.36 కోట్లను వెచ్చించారు. నష్టాల తగ్గింపు, ఆధునీకరణ పనులను సుమారు రూ.1,722.02 కోట్లతో చేపట్టారు. ఇందులో భాగంగా 33/11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్లు 16 నిర్మించనున్నారు. గత మూడు నెలల్లో 421 విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేశారు.

'భోగాపురం' భూమి పూజ నేడే

సాక్షి, అమరావతి, సాక్షి ప్రతినిధి, విజయనగరం: భోగాపురం అంతర్జాతీయ గ్రీన్‌ఫీల్డ్ విమానాశ్రయం నిర్మాణానికి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బుధవారం భూమి పూజ చేయనున్నారు. దీంతోపాటు విజయనగరం జిల్లాలో మరో రెండు కీలక ప్రాజెక్టులు, విశాఖలో రూ.21,844 కోట్లతో అదానీ గ్రూప్ నిర్మించే వైజాగ్ టెక్‌పార్క్ లిమిటెడ్‌కు సీఎం శంకుస్థాపన చేస్తారు. రూ.4,592 కోట్లతో భోగాపురం గ్రీన్‌ఫీల్డ్ విమానాశ్రయం నిర్మాణం కానుండగా ఉత్తరాంధ్ర సమగ్రాభివృద్ధికి బాటలు వేసేలా వైజాగ్ టెక్ పార్కు రూపుదిద్దుకోనుంది. సీఎం జగన్ భోగాపురం మండలం సవరవిల్లి వద్ద నిర్వహించే సభలో ప్రసంగించనున్నారు.

టీఎస్ ఈసెట్-2023 దరఖాస్తుల గడువు పెంపు

ఉస్మానియా యూనివర్సిటీ: టీఎస్ ఈసెట్-2023 దరఖాస్తుల స్వీకరణ గడువును ఈ నెల 8 వరకు పొడిగిస్తున్నట్లు కన్వీనర్ ప్రొ.శ్రీరామ్ వెంకటేష్ మంగళవారం పేర్కొన్నారు. రూ.500 అపరాధ రుసుముతో ఈ నెల 11 వరకు, రూ.1000 అపరాధ రుసుముతో 13 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చని వెల్లడించారు. మే 20న ఏపీలో నాలుగు చోట్ల, తెలంగాణలో 17 ప్రాంతాలలో జరిగే ప్రవేశ పరీక్షకు 21,500 మంది దరఖాస్తు చేసుకున్నారు.

ఢిల్లీ సిగలో 'గులాబీ'

- దేశ రాజధానిలో సిద్ధమైన బీఆర్‌ఎస్ కార్యాలయం
- రేపు ప్రారంభించనున్న సీఎం కేసీఆర్
- వాస్తుపూజతోపాటు సుదర్శన హోమం
- ఏర్పాట్లు పరిశీలించిన మంత్రి వేముల, ఎంపీ సంతోష్



సాక్షి, న్యూఢిల్లీ: దేశ రాజధాని ఢిల్లీలో అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్మితమైన భారత రాష్ట్ర సమితి (బీఆర్‌ఎస్) కేంద్ర కార్యాలయం ప్రారంభోత్సవానికి ముస్తాబవుతోంది. ఐదు అంతస్తుల్లో నిర్మితమైన ఈ భవనాన్ని ఈ నెల 4న తెలంగాణ సీఎం కేసీఆర్ ప్రారంభించనున్నారు. గురువారం ఉదయం వాస్తు పూజతోపాటు సుదర్శన హోమం నిర్వహించనున్నారు. అనంతరం మధ్యాహ్నం 1:05 గంటలకు కేసీఆర్ ఈ భవనాన్ని ప్రారంభిస్తారు.

ఆంక్షలతో ఆలస్యం

ఢిల్లీలోని వసంత్ విహార్‌లో 2021 సెప్టెంబర్ 2న కేసీఆర్ భవన నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఏడాదిలోగా నిర్మాణాన్ని పూర్తి చేయాలని భావించినప్పటికీ.. ఢిల్లీలో కాలుష్యం కారణంగా నిర్మాణ పనులపై ప్రభుత్వం ఆంక్షలు విధించింది. దీంతో అనుకున్న సమయానికి పూర్తి చేయలేకపోయారు. ఏడాదిన్నరగా రోడ్లు భవనాల శాఖ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి నిర్మాణ పనులను ప్రత్యక్షంగా పర్యవేక్షిస్తూ నిర్మాణ సంస్థపై ఒత్తిడి పెంచుతూ పనులు వేగంగా జరిగేలా చూశారు. బీఆర్‌ఎస్ భవన్ ప్రారంభోత్సవానికి ముహూర్తం ఖరారైన నేపథ్యంలో ప్రశాంత్ రెడ్డి, ఎంపీ జోగినపల్లి సంతోష్ కుమార్ మూడు రోజులుగా ఢిల్లీలోనే మకాం వేసి ఏర్పాట్లను ప్రత్యక్షంగా పరిశీలిస్తున్నారు.

ఐదంతస్తుల్లో 20 వేల చదరపు అడుగులు

మొత్తం 1,300 గజాల్లో ఉన్న స్థలంలో 20 వేల చదరపు అడుగుల ప్రాంతంలో భవనాన్ని నిర్మించారు. అందులో లోయర్ గ్రౌండ్, గ్రౌండ్, మొదటి, రెండవ, 3వ అంతస్తులతో కలిపి మొత్తం 5 అంతస్తులు న్నాయి. లోయర్ గ్రౌండ్‌లో మీడియా సమావేశాల ను నిర్వహించేందుకు వీలుగా మీడియా హాల్‌తోపాటు రెండు ఇతర గదులను నిర్మించారు. లోయర్ గ్రౌండ్‌లోకి వచ్చే మీడియాకు వీలుగా ఉండేలా ప్రత్యేక ఎంట్రెన్స్‌ను ఏర్పాటు చేశారు. ఆ తర్వాత గ్రౌండ్ ఫ్లోర్‌లో పార్టీ ప్రధాన కార్యదర్శుల కోసం నాలుగు గదులు, కార్యాలయ రిసెప్షన్, కార్యకర్త లు, నాయకుల కోసం క్యాంటీన్‌ను సిద్ధం చేశారు. మొదటి అంతస్తులో పార్టీ అధ్యక్షుడి చాంబర్, పేషీ, కాన్ఫరెన్స్ హాల్ ఉన్నాయి. 2,3 అంతస్తుల్లో ఢిల్లీలో పార్టీకి సంబంధించిన కార్యక్రమాలకు వచ్చే కార్యకర్తలు, నాయకులు బస చేసేందు కు 18 గదులతోపాటు రెండు ప్రత్యేక సూట్ రూమ్‌లను సిద్ధం చేశారు. సూట్ రూమ్‌లలో పార్టీ అధ్యక్షుడు, పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు బస చేస్తారు.

గవర్నర్‌కు ఆహ్వానమే లేదు

- అందుకే సచివాలయ ప్రారంభోత్సవానికి హాజరు కాలేదు
- రాజ్‌భవన్ నుంచి ప్రకటన విడుదల

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర నూతన సచివాలయ భవన ప్రారంభోత్సవానికి గవర్నర్ తమిళిసై సౌందరరాజన్‌కు రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఆహ్వానం అందలేదని రాజ్‌భవన్ స్పష్టం చేసింది. ఆహ్వానించినా ఆమె గైర్హాజరయ్యారనడం నిరాధారణ, తప్పుడు ఆరోపణలని తోసిపుచ్చింది. రాష్ట్రంలో అభివృద్ధిని చూసి ప్రగతి నిరోధక శక్తులు తట్టుకోలేకపోతున్నాయని, సచివాలయ ప్రారంభోత్సవానికి గవర్నర్ రాకపోవడం అందులో భాగమేనని రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి జగదీశ్ రెడ్డి సోమవారం సూర్యాపేటలో మీడియాతో మాట్లాడుతూ విమర్శించిన విషయం తెలిసిందే. ప్రారంభోత్సవానికి రావడం, రాకపోవడం ఆమె విజ్ఞతకే వదిలేస్తున్నామని ఆయన పేర్కొన్నారు. ఆయన ఆరోపణలపై రాజ్‌భవన్ పరోక్షంగా స్పందించింది. ఈ మేరకు మంగళవారం ప్రకటన విడుదల చేసింది.

మహారాష్ట్రలో ప్రభంజనం ఖాయం: కేసీఆర్

- కొందరు సిట్టింగ్ ఎమ్మెల్యేలు నన్ను సంప్రదిస్తున్నారు
- అధికారంలోకి వస్తే అక్కడ తెలంగాణ మోడల్
- 'అబ్ కీ బార్ కిసాన్ సర్కార్' మూలమూలకూ వెళ్లాలి
- మహారాష్ట్ర బీఆర్‌ఎస్ నేతలతో భేటీ



మహారాష్ట్ర బీఆర్‌ఎస్ నేతలతో మాట్లాడుతున్న సీఎం కేసీఆర్

సాక్షి, హైదరాబాద్: ప్రజాచైతన్యమే తమ పార్టీ ఆయువుపట్టు అని, మహారాష్ట్రలో ప్రభంజనం సృష్టిస్తుందని బీఆర్‌ఎస్ అధినేత, ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు అన్నారు. బీఆర్‌ఎస్‌కు వస్తున్న ఆదరణ చూసి మహారాష్ట్రకు చెందిన అనేకమంది సిట్టింగ్ ఎమ్మెల్యేలు తనతో సంప్రదింపులు జరుపుతున్నారని చెప్పారు. మహారాష్ట్రలో ఏం జరగబోతోందో మీరే చూస్తారు అని వ్యాఖ్యానించారు. అధికారంలోకి వస్తే మహారాష్ట్రలో తెలంగాణ మోడల్ అమలు చేస్తామని అన్నారు. మంగళవారం తెలంగాణ భవన్‌లో మహారాష్ట్రకు చెందిన ముఖ్య నేతలతో కేసీఆర్ భేటీ అయ్యారు. అక్కడ బీఆర్‌ఎస్ అనుసరించాల్సిన వ్యూహంపై సుదీర్ఘంగా చర్చించారు. మే 10 నుంచి జూన్ 10 వరకు మహారాష్ట్ర మూల మూలకు 'అబ్ కీ బార్ కిసాన్ సర్కార్' నినాదం వెళ్లాలని స్పష్టం చేశారు.

అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి

'మాజీ ఎంపీలు, మాజీ ఎమ్మెల్యేలు, జెడ్పీ చైర్మన్లు, బ్లాక్ స్థాయి ప్రజాప్రతినిధులు, ముఖ్యనేతలు ఇప్పటికే బీఆర్‌ఎస్‌లో చేరారు. కొంతమంది సిట్టింగ్ ఎమ్మెల్యేలు కూడా రావటానికి సిద్ధంగా ఉన్నారు. అనేకమంది నాతో సంప్రదింపులు, చర్చలు జరుపుతున్నారు. ఈ నేపథ్యంలో బీఆర్‌ఎస్ సిద్ధాంతాన్ని, లక్ష్యాన్ని ప్రజలకు చేరవేసి వారి ప్రేమను పొందాలి. ప్రజల మనసులు గెలవడం బీఆర్‌ఎస్ లక్ష్యం. తెలంగాణ తర్వాత మహారాష్ట్రకే దేశాన్ని మలుపుతిప్పే అవకాశం వచ్చింది. దీన్ని సద్వినియోగం చేసుకోవాలి' అంటూ కేసీఆర్ దిశా నిర్దేశం చేశారు.

త్వరలో జిల్లా సమన్వయకర్తల నియామకం

రెండు, మూడురోజుల్లో జిల్లా సమన్వయకర్తల నియామకం పూర్తి చేస్తామని, మే 10 నుంచి జూన్ 10 వరకు పార్టీ సంస్థాగత నిర్మాణంతో పాటు పార్టీ సభ్యత్వ నమోదు పూర్తి కావాలని కేసీఆర్ ఆదేశించారు. ఒకేరోజు ఒకే సమయంలో 288 నియోజకవర్గ కేంద్రాల నుంచి పార్టీ సంస్థాగత నిర్మాణం ప్రారంభం కావాలన్నారు. శివాజీ, అంబేడ్కర్ విగ్రహాల వద్ద నుంచి పార్టీ కార్యక్రమాలు ప్రారంభం కావాలని చెప్పారు. సాధారణ సభ్యత్వానికి రూ.10, క్రియాశీల సభ్యత్వానికి రూ.50 చొప్పున తీసుకోవాలన్నారు. మే 8, 9 తేదీల్లో మహారాష్ట్ర నేతలకు హైదరాబాద్ తెలంగాణ భవన్‌లో శిక్షణ శిబిరాలు ఉంటాయని తెలిపారు. ఈ భేటీలో మంత్రి జగదీశ్‌రెడ్డి, ఎంపీ బీబీ పాటిల్, ప్రభుత్వ విప్ బాల్క సుమన్, పీయూసీ చైర్మన్ జీవన్‌రెడ్డి, రైతుబంధు సమితి రాష్ట్ర అధ్యక్షుడు పల్లా రాజేశ్వర్‌రెడ్డి, ఎమ్మెల్సీ మధుసూదనాచారి, ఎమ్మెల్యే జోగురామన్న, మాజీ ఎంపీ నగేశ్, దాసోజు శ్రవణ్, మహారాష్ట్ర ముఖ్యనేతలు మాణిక్ కదం, మాజీ ఎమ్మెల్యే శంకరన్న డోంగే, మాజీ మేయర్ రవీంద్రసింగ్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా...

సీబీఐ విచారణకు హాజరైన వివేకా పీఏ కృష్ణారెడ్డి

సాక్షి, హైదరాబాద్ : మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసు దర్యాప్తులో భాగంగా సీబీఐ అధికారులు వివేకా పీఏ కృష్ణారెడ్డిని మంగళవారం ప్రశ్నించారు. హత్యకు ముందు వివేకానందరెడ్డి రాసిన లేఖను కృష్ణారెడ్డి దాచిపెట్టిన విషయంపైనే ఎక్కువ ప్రశ్నలు అడిగినట్టు సమాచారం. మధ్యాహ్నం 3 గంటలకు కోఠిలోని సీబీఐ కార్యాలయానికి వచ్చిన కృష్ణారెడ్డిని ఐదు గంటలకు పైగా ప్రశ్నించారు. హత్య జరిగిన ప్రాంతంలో లభించిన కీలక ఆధారమైన ఆ లేఖను ఎందుకు దాయాల్సి వచ్చింది? ఎవరు ఆదేశాలిచ్చారు? లేఖను ఎవరు తొలుత గుర్తించారు? తర్వాత దాన్ని ఎక్కడ దాచిపెట్టారు? లేఖ విషయం తొలుత ఎవరెవరితో పంచుకున్నారు? లేఖను ఎన్ని గంటలకు పోలీసులకు అప్పగించారు? అప్పటి వరకు లేఖను గోప్యంగా ఉంచడానికి ప్రత్యేక కారణాలేవైనా ఉన్నాయా?.. ఇలా అనేక అంశాలపై సీబీఐ అధికారులు ప్రశ్నించారు. అధికారుల ప్రశ్నలకు కృష్ణారెడ్డి ముక్తసరిగా సమాధానాలిచ్చినట్లు తెలిసింది. ఇటీవల పులివెందులలోని కృష్ణారెడ్డి ఇంటికి సీబీఐ అధికారులు వెళ్లగా, ఆ సమయంలో ఆయన అందుబాటులో లేకపోవడంతో కుటుంబ సభ్యుల నుంచే వివరాలు సేకరించారు. ఆ తర్వాత విచారణకు హాజరుకావాలని కృష్ణారెడ్డికి నోటీసులు జారీ చేశారు. దీంతో ఆయన మంగళవారం సీబీఐ కార్యాలయంలో విచారణకు హాజరయ్యారు.

వివేకా హత్యకేసులో సాక్షి రంగన్న పరిస్థితి విషమం

వయసు రీత్యా అనారోగ్య సమస్యలు



పులివెందుల: మాజీమంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్యకేసులో సాక్షిగా ఉన్న వాచ్‌మన్ రంగన్న ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉంది. వివేకా హత్య జరిగిన రోజు అక్కడే ఉన్న వాచ్‌మన్ రంగన్న కోర్టుకు ఇచ్చిన 164 స్టేట్‌మెంట్‌లో కూడా వివేకాను ఎర్ర గంగిరెడ్డి, ఉమా శంకర్‌రెడ్డి, సునీల్‌యాదవ్, దస్తగిరి హత్యచేశారని చెప్పిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో వయసు రీత్యా పలు అనారోగ్య కారణాలవల్ల వాచ్‌మన్ రంగన్న ఆరోగ్య పరిస్థితి దెబ్బతింది. దీంతో వాచ్‌మన్ రంగన్న ఇంటివద్ద ఉన్న సెక్యూరిటీ పోలీసులు, కుటుంబసభ్యులు మంగళవారం పులివెందుల ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి తరలించారు. మెరుగైన చికిత్స కోసం తిరుపతి స్విమ్స్‌కు తీసుకెళ్లాలని వైద్యులు సూచించడంతో రంగన్నను అంబులెన్స్‌లో తిరుపతి స్విమ్స్‌కు తీసుకెళ్లారు.

నేటినుంచి మన్యంకొండ లక్ష్మీనరసింహస్వామి ఉత్సవాలు

మహబూబ్‌నగర్ రూరల్: మన్యంకొండ శ్రీ లక్ష్మీ వేంకటేశ్వరస్వామి దేవస్థానానికి అనుబంధంగా ఉన్న లక్ష్మీనరసింహస్వామి ఉత్సవాలను బుధవారం నుంచి మూడు రోజుల పాటు నిర్వహించనున్నారు. ఉత్సవాలలో భాగంగా మొదటి రోజు శుద్ధి పుణ్యావాహచనం, అంకుర్పారణ, రాత్రికి హనుమత్ వాహన సేవ ఉంటుంది. 4న గురువారం మధ్యాహ్నం 12 గంటలకు స్వామివారి కల్యాణం, రాత్రికి గరుడ వాహన సేవ, మూడోరోజు శుక్రవారం ఉదయం వసంతోత్సవం, అవభృత స్నానం కార్యక్రమాలు నిర్వహిస్తామని, ఆలయ చైర్మన్ అళహరి మధుసూదన్‌కుమార్ తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో ఉత్సవాలకు హాజరుకావాలని కోరారు.

వికసించిన 'మే పుష్పం'



స్టేషన్ మహబూబ్‌నగర్: జిల్లా కేంద్రంలో ఓ నివాస గృహం ఆవరణలో వికసించిన మే పుష్పం పలువురికి ఆకట్టుకుంటుంది. స్థానిక శెట్టి కాంప్లెక్స్ సమీపంలోని రిటైర్డ్ లెక్చరర్ జి.పాండురంగం నివాసంలో మే పుష్పం వికసించింది. ఈ సందర్భంగా పాండురంగం మాట్లాడుతూ 40ఏళ్ల నుంచి మే నెల మొదటి వారంలో ఈ పుష్పం వికసిస్తుందన్నారు. చుట్టు పక్కల నివాసాల ప్రజలు ఈ అందమైన పుష్పాన్ని చూసి ఆనందపడుతున్నారు.

కానిస్టేబుల్‌కు సన్మానం

నాగర్‌కర్నూల్: చనిపోయిందనుకున్న మహిళను సీపీఆర్ చేసి ప్రాణాలు కాపాడిన కానిస్టేబుల్ మల్లేష్‌ను నాగర్‌కర్నూల్ కలెక్టర్ పి.ఉదయ్‌కుమార్ మంగళవారం సాయంత్రం ప్రశంసించి సన్మానించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సీపీఆర్‌పై ప్రతీ ఒక్కరికి అవగాహన కలిగి ఉండాలని, సమయస్ఫూర్తితో వ్యవహరించి.. ప్రతి ఒక్కరూ కానిస్టేబుల్ మల్లేషలా ఉండాలన్నారు. కార్యక్రమంలో డీఎంహెచ్‌ఓ డాక్టర్ కె.సుధాకర్‌లాల్, డీపీఓ రేణయ్య, డీడీఎం సందీప్ తదితరులు పాల్గొన్నారు.

బీచుపల్లి అంజన్న బ్రహ్మోత్సవాలు

- నేటినుంచి కొనసాగనున్న ఉత్సవాలు
- ఏర్పాట్లు పూర్తిచేసిన అధికార యంత్రాంగం




విద్యుత్ దీపాలతో వెలుగుతున్న ఆలయ ముఖద్వారం

ఎర్రవల్లిచౌరస్తా: ఉమ్మడి పాలమూరు జిల్లాలో పేరుగాంచిన బీచుపల్లి ఆంజనేయస్వామి బ్రహ్మోత్సవాలు బుధవారం ప్రారంభం కానున్నాయి. ఐదురోజులపాటు కొనసాగే ఉత్సవాల్లో భాగంగా మొదటిరోజు ఉదయం పంచామృతాభిషేకం, వాస్తు పూజ హోమం, అగ్ని ప్రతిష్ఠ, ధ్వజారోహణం, బలిహరణ, రాత్రికి తెప్పోత్సవం, గురువారం ఉదయం పంచామృతాభిషేకం, స్వామివారి ఉపనయనం, రాత్రికి ప్రభోత్సవం, శుక్రవారం ఉదయం పంచామృతాభిషేకం, వ్యాసపూజ, మధ్యాహ్నం సీతారాముల కల్యాణం, బలిహరణం, సాయంత్రం రథంగ హోమం, రాత్రికి కుంభం, రథోత్సవం, శనివారం ఉదయం పంచామృతాభిషేకం, చౌకీసేవ, బలిహరణం, రాత్రికి ప్రభోత్సవం, ఆదివారం ఉదయం అమృతస్నానం, పంచామృభిషేకం, రాత్రికి పల్లకీసేవతో ఉత్సవాలు ముగుస్తాయి.

ఇదీ ఆలయ చరిత్ర..

ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ట 16వ శతాబ్దంన జరిగిందని చారిత్రక పరిశోధకులు నిర్వహించారు. ఈ ఆంజనేయస్వామి వారు ప్రతిష్ఠించిన రోజు రాత్రి వ్యాసరాయల వారికి కలలో కనిపించి రేపు ఉదయం నన్ను దర్శించుకోవడానికి ముందుగా ఎవరు వస్తారో వారినే నాకు ప్రతిరోజు పూజలు చేయమని ఆదేశించారు. ఉదయం దర్శనానికి మొదట బీచుపల్లి అనే ఒక పశువుల కాపరి పశువులను మేపుతూ వచ్చి స్వామివారిని దర్శించుకోగా.. అతనినే పూజారిగా నియమించారు. కాలక్రమేణా పూజారి పేరిట ఆలయానికి బీచుపల్లి రాయుడని పేరు వచ్చింది. బీచుపల్లి ఆంజనేయస్వామిని గద్వాల సంస్థాన రాజులు సైతం ప్రతిరోజు దర్శించుకునేవారు. ఈ క్రమంలో ప్రతిఏటా జరిగే బ్రహ్మోత్సవాల్లో సీతారాముల కల్యాణానికి ఆలయ వ్యవస్థాపక వంశీయులు మాజీ మంత్రి డీకే అరుణ భరతసింహారెడ్డి పట్టువస్త్రాలు, ముత్యాల తలంబ్రాలను సమర్పిస్తారు. ఉత్సవాల సందర్భంగా ఆలయాన్ని విద్యుద్దీపాలతో అలంకరించారు.



బీచుపల్లిలో వెలసిన ఆంజనేయస్వామి

ఏర్పాట్లు పూర్తి..

ఆంజనేయస్వామి ఉత్సవాలకు అవసరమైన అన్ని ఏర్పాట్లను పకడ్బందీగా చేసినట్లు ఈఓ ఉమారాణి మంగళవారం తెలిపారు. ఆలయ చుట్టు పక్కల ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో హాజరై స్వామివారిని దర్శించుకొని ఉత్సవాలను విజయవంతం చేయాలని కోరారు.

ఆందోళనలో చిన్నోనిపల్లి ముంపు గ్రామస్తులు



రిజర్వాయర్ గండిని పూడ్చిన దగ్గర నిలిచిన నీటిని పరిశీలిస్తున్న నిర్వాసితులు

గట్టు: అకాల వర్షంతో చిన్నోనిపల్లి ముంపు గ్రామస్తులు ఆందోళన చెందుతున్నారు. గ్రామస్తులంతా కలసి రిజర్వాయర్ కట్ట దగ్గరకు వెళ్లి పరిశీలించారు. వాగుల్లోని వర్షపు నీరు రిజర్వాయర్ బయటకు వెళ్లకుండా నిలిచి పోవడంతో గ్రామస్తులు ఆందోళన చెందుతున్నారు. చిన్నోనిపల్లె రిజర్వాయర్ కట్ట గండిని పూడ్చే పనులు నెలన్నర రోజులుగా కొనసాగగా, రెండు రోజుల క్రితం ముంపు గ్రామస్తులు పనులను అడ్డుకున్నారు. అయితే అకాల వర్షాల కారణంగా వాగుల్లో నీరు పొంగిపొర్లుతున్న తరుణంలో వాగుల దగ్గర వదిలేసిన గండిని కొంత వరకు పూడ్చివేయడంతో వాగుల్లోని నీరు రిజర్వాయర్ బయటకు వెళ్లకుండా ఆగిపోయాయి. వర్షాలు ఇలానే కొనసాగితే వర్షపు నీరు నివాస గృహాల్లోకి వచ్చే అవకాశం ఉందని చిన్నోనిపల్లి నిర్వాసితులు ఆందోళన చెందుతున్నారు. పునరావాస కేంద్రంలో కనీస సౌకర్యాలు కల్పించలేదని, ఇప్పటికిప్పుడు పునరావాస కేంద్రంలో ఇళ్లు కట్టుకునే పరిస్థితి లేదని నిర్వాసితులు వాపోతున్నారు.

రాష్ట్రస్థాయిలో విద్యార్థుల ప్రతిభ



పాలమూరు: హైదరాబాద్‌లోని నాంపల్లిలో మంగళవారం నిర్వహించిన రాష్ట్ర స్థాయి విద్యార్థి విద్య ప్రాజెక్టులో జిల్లా కేంద్రంలోని ఎన్టీఆర్ మహిళా డిగ్రీ కళాశాలకు చెందిన కంప్యూటర్‌సైన్స్ విద్యార్థులు ఆరుగురు ప్రాజెక్టు ప్రజంటేషన్ ఇచ్చారు. దీంతో ఆరుగురు విద్యార్థులకు ప్రత్యేక సర్టిఫికెట్స్ అందజేశారు. వీరిని కళాశాల ప్రిన్సిపాల్ గంగాధర్ అభినందించారు. కార్యక్రమంలో లెక్చరర్ శ్రీనివాసులు, రఘువీర్ గుప్తా పాల్గొన్నారు.

'ఎస్‌వీఎస్' లో అరుదైన చికిత్స



అరుదైన చికిత్స చేస్తున్న వైద్య బృందం

పాలమూరు: మహబూబ్‌నగర్‌లోని ఎస్‌వీఎస్ ఆస్పత్రిలో అరుదైన శస్త్రచికిత్స చేశారు. వివరాల్లోకి వెళితే.. బాలానగర్‌కు చెందిన 27ఏళ్ల మహిళ ఎనిమిదేళ్లుగా పావురాల పెంపకం పని చేస్తోంది. అయితే మూడేళ్ల నుంచి శ్వాస తీసుకునే ఇబ్బందితో బాధపడుతూ ఎన్నో ఆస్పత్రులు తిరిగి వైద్యం పరీక్షలు చేయించుకుంది. అలాగే టీబీ మందులు సైతం వాడిన ఎలాంటి ఫలితం లేకపోవడంలో ఆయాసం ఎక్కువ కావడంతో ఎస్‌వీఎస్ ఆస్పత్రిలోని ఊపిరితిత్తుల వైద్యవిభాగానికి వచ్చారు. మొదట వైద్యులు మిలియరి టీబీ అనే అనుమానంతో సీటీ స్కాన్ చేయడంతో పాటు తేమడ, బ్రాంకోస్కోపి వంటి పరీక్షల్లో ఏమి నిర్ధారణ కాలేదు. దీంతో వైద్యులు ఆమెకు క్రయో బయాప్సి చేయాలని నిర్ణయించి అత్యాధునిక రిజిడ్ బ్రాంకోస్కోపీ పద్ధతి ద్వారా ఊపిరితిత్తుల వైద్య విభాగం ప్రొఫెసర్ తుమ్మూరు వెంకటేశ్వర్‌రెడ్డి ఆధ్వర్యంలో శస్త్రచికిత్స విజయవంతంగా నిర్వహించారు. దాదాపు తొమ్మిదిమంది వైద్య బృందం కలిసి చికిత్స చేశారు. ఈ బృందాన్ని ఎస్‌వీఎస్ రెసిడెంట్ డైరెక్టర్ రాంరెడ్డి అభినందించారు.

మిషన్ భగీరథ పైపులైన్ పనుల పరిశీలన



పైపులైన్ పనులను పరిశీలిస్తున్న మిషన్ భగీరథ అధికారులు

కొల్లాపూర్ రూరల్: మండల పరిధిలోని సున్నపు తండా దగ్గర జరుగుతున్న మిషన్ భగీరథ పైపులైన్ పనులను భగీరథ అధికారులు, మరియు పాలమూరు ప్రాజెక్టు అధికారులు కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పైపులైన్ పనులను త్వరగా పూర్తి చేయాలని సంబంధిత కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. వేసవిలో తాగునీటి కోసం ఇబ్బందులు లేకుండా త్వరగా పనులు పూర్తి చేయాలన్నారు. ఆరు నెలల నుంచి పనులు జరుగుతున్నాయని, పైప్‌లైన్ కోసం ప్రభుత్వం రూ.140కోట్లు కోట్లు కేటాయించిందన్నారు. మిషన్ భగీరథ ఎస్‌ఈ వెంకటరమణ, పాలమూరు ప్రాజెక్టు ఈఈ సంజీవరావు, మరియు ఏఈలు, డీఈలు, ఉన్నారు.

విషపూరిత కంపెనీలు మాకొద్దు



రిలే దీక్ష చేపడుతున్న యువకులు

మహమ్మదాబాద్: మండలంలోని నంచర్లగేట్(దేశాయిపల్లి) శివారులో గల మినీ ఇండస్ట్రీలో ఏర్పాటు చేస్తున్న ప్రమాదకర ఫార్మా కంపెనీ వద్దంటూ ఏర్పాటు చేసిన రిలే నిరాహార దీక్ష మంగళవారం మూడవ రోజుకు చేరింది. పచ్చని పొలాల్లో విషం చిమ్మే ఫార్మా కంపెనీ ఇక్కడ వద్దంటూ ఆయా గ్రామాల ప్రజలు, యువకులు, రైతులు రిలే నిరాహార దీక్షను చేపట్టారు. ఈ సందర్భంగా పలువులు మాట్లాడుతూ ఎలాంటి కలుషిత వాతావరణం లేని పల్లెల్లో ఇలాంటి విషపూరిత కంపెనీలు వద్దంటూ ఆందోళన చేసినా అధికారులు, ప్రజాప్రతినిధులు పెడచెవిన పెడుతున్నారని ఆరోపించారు. ప్రజాభిప్రాయానికి విరుద్ధంగా కంపెనీలను పెడితే ఎలాంటి ఆందోళనలు చేయడానికైనా సిద్ధమేనంటూ హెచ్చరించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకుడు కేఎం నారాయణ, కొండారెడ్డిపల్లి సర్పంచ్ ప్రభాకర్‌రెడ్డి, పాష, నరేష్, కేశవులు తదితరులు పాల్గొన్నారు.

'మైనార్టీ గురుకులాల సిబ్బందికి పీఆర్‌సీ ఇవ్వండి'

స్టేషన్ మహబూబ్‌నగర్: మైనార్టీ గురుకులాల సిబ్బందికి పీఆర్‌సీ ప్రకటించాలని ఆల్ మైనార్టీ ఎంప్లాయిస్ వర్కర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు షేక్ ఫారుఖ్ హుస్సేన్ మంగళవారం తెలిపారు. ఈమేరకు రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్‌కు మెయిల్ ద్వారా వినతిపత్రం అందజేశారు. రాష్ట్రంలోని 204 మైనార్టీ గురుకులాల్లో దాదాపు 1600 మంది ప్లంబర్లు, ఎలక్ట్రిషియన్లు, హౌస్‌కీపింగ్, వంటవాళ్లు, సెక్యూరిటీ సిబ్బందికి 30శాతం ఫిట్‌మెంట్‌తో కూడిన పీఆర్‌సీ ఇస్తామని చెప్పి ఇంతవరకు ఇవ్వలేదని పేర్కొన్నారు. ఈ విషయంలో గతంలో పలుసార్లు తమ సంఘా పక్షాన మంత్రి, కార్యదర్శి షఫీవుల్లాకు వినతి పత్రాలు అందజేస్తామని తెలిపారు. వెంటనే గురుకులాల సిబ్బందికి న్యాయం చేయాలని, రెగ్యూలర్ విధులు నిర్వహిస్తున్న ప్రిన్సిపాల్, లెక్చరర్లకు నియామకపు నెలలోనే ఇంక్రిమెంట్లు మంజూరు చేయాలని మంత్రికి విజ్ఞప్తి చేశారు.